
Email : telanganaveenaofficial@gmail.com
Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

epaper.telanganaveena.com | సంపుటి :1 | సంచిక: 360 | హైదరాబాద్ | శనివారం | 14 -09 - 2024 | పేజీలు: 8 | రూ.3/-




## నిబంధనలు లేకుండా తక్షణ సాయం నిధులు



- వరదల వల్ల తీవ్ర నష్టం సంభవించినట్లు వెల్లడి
- తెలంగాణ వరదనష్టపై కేంద్ర బృందంతో చర్చలు
- ఇటీవలి వరద నష్టపై శాశ్వత పరిష్కరానికి వినతి
- సచివాలయంలో కేంద్ర బృందంతో సిఎం రేవంత్ చర్చలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:**తెలంగాణలో వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కేంద్ర బృందాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో వరద నష్టం అంచనాపై సచివాలయంలో కేంద్ర బృందంతో ఆయన సమావేశమయ్యారు. వరదల నివారణకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ ఉండాలన్నారు. రాష్ట్రంలో జరిగిన వరద నష్టాన్ని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనలు లేకుండా తక్షణ సాయం నిధుల విడుదలకు విజ్ఞప్తి చేశారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తెలంగాణలో వరదల వల్ల తీవ్ర నష్టం సంభవించిన దృష్ట్యా ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణ సాయం విడుదల చేయాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర బృందాన్ని కోరారు. రాష్ట్రంలో వరద నష్టాన్ని అంచనా వేసేందుకు వచ్చిన కేంద్ర బృందంతో ఆయన సచివాలయంలో శుక్రవారం భేటీ అయ్యారు. వరదల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు. వరదల నివారణకు శాశ్వత నిధి ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత పరిష్కారానికి కార్యాచరణ ఉండాలని.. వరద నష్టాన్ని కేంద్ర బృందం దృష్టికి తీసుకెళ్లారు. మున్నేరు వాగుకు రిటైనింగ్ వాల్ నిర్మిస్తే వరద సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కాగా, రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు..జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సలహాదారు కల్నల్ కేపీ సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం ఖమ్మం జిల్లాలో పర్యటించింది. ఖమ్మం నగరంతో పాటు వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు

వివరాలు 2లో



## తెలుగు ప్రజలకు ప్రధాని చవితి కానుక

- 16న రెండు కొత్త వందే భారత్ రైళ్లకు జెండా
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:**తెలుగు ప్రజలకు ప్రధాని మోడీ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భ ంగా కానుక అందించారు. 16న ప్రధాని మోడీ తెలుగు రాష్ట్రాల్లో 2 కొత్త వందే భారత్ రైళ్లను ప్రారంభించనున్నారు.నాగ్పూర్ – హైదరాబాద్, దుర్గ్ – విశాఖపట్టణం మధ్య రెండు వందే భారత్ రైళ్లు పరుగులు పెట్టనున్నాయి. ఢిల్లీ తర్వాత హైదరాబాద్ నుంచే అత్యధికంగా వందేభారత్ రైళ్ల అనుసంధానత కలిగిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

## తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

- ఉద్యమంలోనూ ఇంతటి నిర్బంధం ఎదుర్కోలే
- మీడియాతో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:** పదేళ్లపాటు శాంతి భద్రతల సమస్య రాకుండా బీఆర్ఎస్ పాలన సాగిందని.. కానీ ఇప్పుడా పరిస్థితి లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావుఅన్నారు. తెలంగ్రాణ ఉద్యమ సమయంలో కూడా ఇంతటి నిర్బంధం ఎదుర్కోలేదని అన్నారు. హైదరాబాద్‌లోని నివాసంలో శుక్రవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనక్కి వెళ్తోందని.. శాంతిభద్రతలు క్షీణిస్తుండటంపై పెట్టుబడిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపుతప్పడానికి సీఎం రేవంత్ రెడ్డి కారణమని విమర్శలు గుప్పించారు. 'శాంతి భద్రతలు అదుపు తప్పడానికి చేసిందంతా చేసి భాగ్యనగరం బ్రాండ్ ఇమేజ్ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి బందోబస్తు ఇచ్చి దాడులు

వివరాలు 2లో



## హైడ్రాపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:**

సంచలనం సృష్టిస్తున్న 'హైడ్రా'పై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. హైడ్రా(జీవో 99) రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. జిహెచ్ఎంసి యాక్ట్కు కాదని, హైడ్రాకు అధికారాల బదిలీ ఎలా చేస్తారని పిటిషనర్ ప్రశ్నించారు. కాగా హైదరాబాద్ లోని చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్లో ఆక్రమణలను హైడ్రా కూల్చివేస్తోంది.



## జైలు నుండి విడుదలైన కేజ్రీవాల్

**తెలంగాణ వీణ/ఢిల్లీ: సెప్టెంబర్ 13:** ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తిహాడ్ జైలు నుంచి విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో మనీలాం డరింగ్ ఆరోపణలతో అరెస్టయిన ఆయనకు శుక్రవారం సుప్రీం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. విడుదలకు అవసరమైన ప్రక్రియ పూర్తి కావడంతో బెయిలు మంజూరైన కొన్ని గంటల వ్యవధిలోనే ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఆప్ శ్రేణులు, కేజ్రీవాల్ అభిమానులు జైలు వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకొని ఆయనకు స్వాగతం పలి కారు. వర్షం కురుస్తుండగా.. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారందరికీ కేజ్రీవాల్ అభివాదం చేస్తూ కనిపించారు.



## స్వగృహానికి సీతారాం ఏచూరి భౌతికకాయం.. పలువురు నివాళి

**తెలంగాణ వీణ/ఢిల్లీ: సెప్టెంబర్ 13:** కామ్రేడ్ సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి ఆయన స్వగృ హానికి తరలించారు. అక్కడ ఆయన సహచరులు నివాళులు అర్పించారు. పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, ఎంఎ బేబీ, కామ్రేడ్ అశోక్ ధావలే, కామ్రేడ్ సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని ఆయన ఇంటికి తరలిం చి అక్కడ ఆయన సహచరులు నివాళులు అర్పించారు.పొలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బృందా కారత్, కామ్రేడ్ ఎంఎ బేబీ, కామ్రేడ్ అశోక్ ధావ లే, ఎ.విజయరాఘవన్, రాజ్యసభ ఎంపీ వి. శివదాసన్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మరియం ధావలే, ఎస్ ఎఫ్ఐ జాతీయ నాయకులు, అనేక మంది సహచరులు నివాళులర్పించారు.

## రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:** రానున్న 24 గంటల్లో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆగ్నేయ బంగ్లాదేశ్ పరిసర ప్రాంతాలపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది.దీని ప్రభావంతోనే కోస్తా బంగ్లాదేశ్, ఉత్తర బంగాళాఖాతం పరిసర ప్రాంతాలపై అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. ఆ తరువాత 48 గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా కదులుతూ వాయుగుండంగా అల్పపీడనం బలపడుతుంది. పశ్చిమ బెంగాల్, వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశముంది. దీని ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో మోస్తారు నుంచి తేలికపాటి వర్షాలు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. కోస్తాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని.. మిగతా ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.




## జిఎస్టీ గురించి అడిగతే బెదిరింపులా?



- తమిళనాడు రెస్టారెంట్ యజమాని క్షమాపణలు
- నిర్మలా సీతారామన్ తీరుపై మండిపడ్డ ఖర్గే


**తెలంగాణ వీణ/ఢిల్లీ: సెప్టెంబర్ 13:** ఆహార పదార్థాలపై జీఎస్టీ విషయంలో తమిళనాడుకు చెందిన 'శ్రీ అన్నపూర్ణ రెస్టారెంట్' యజమాని శ్రీనివాసన్ ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. పెరుగుతున్న జీఎస్టీ గురించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ప్రశ్నించారు. రెస్టారెంట్లు ఎదుర్కొంటున్న సవాళ్లను తెలియజేశారు. అనంతరం

వివరాలు 2లో

# రెడ్డి ల్యాబ్స్ రూ. 5 కోట్లు, బాలకృష్ణ రూ.50 లక్షల విరాళం...

**- తెలంగాణ వరద బాదితుల కోసం ఇస్తున్నట్లు ప్రకటన**

**- తేజస్విని అభినందించిన రేవంత్**



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:** వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ 50లక్షల రూ.ల విరాళం అందించారు. బాలకృష్ణ తరపున వారి కూతురు తేజస్విని సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి విరాళం చెక్కు ను అందజేశారు. సహాయ కార్యక్రమాల్లో ప్రభుత్వానికి అండగా నిలిచి విరాళం అందించిన వారిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.5కోట్లు విరాళంగా అందించారు డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి చెక్ ను డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి. నారాయణరెడ్డి అందజేశారు.

# కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలి: అరెకపూడి గాంధీ



**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:**తనను ఆంధ్రోడన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలకు కేసీఆర్ సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే అరెకపూడి డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి బతకడానికి హైదరాబాద్ కు వచ్చినట్టే తాను కూడా హైదరాబాద్‌కు వచ్చానని ఆయన చెప్పారు. ఎంతో మందిని చీటింగ్ చేసిన కౌశిక్ రెడ్డితో తనకు పోలికేంటని ఎద్దేవా చేశారు. తనను బీఆర్ఎస్‌లో చేర్పించింది హరీశ్ రావు అని చెప్పారు. తాను బీఆర్ఎస్‌లోనే ఉన్నానని తెలిపారు. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని అసెంబ్లీ స్పీకర్ కూడా ప్రకటించారని చెప్పారు.

# స్కూళ్లకు వరుస సెలవులు

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:** తెలంగాణ విద్యార్థులకు విద్యాశాఖ గుడ్ న్యూస్ చెప్పింది. శనివారం నుంచి స్కూళ్లకు వరుసగా సెలవులను ప్రకటించింది. కొన్ని రాష్ట్రాల్లో 4 రోజులు సెలవు ఉంటే.. మరికొన్ని రాష్ట్రాల్లో 5 రోజులు ఉన్నాయి. ఇక మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం విద్యార్థులకు వరుసగా మూడు రోజులు సెలవులు వస్తున్నాయి. సెప్టెంబర్ నెల 14వ తేదీ రెండో శనివారం కావడం వల్ల స్కూళ్లకు సెలవు. ఇక 15వ తేదీ ఆదివారం కావడం వల్ల వరుసగా 2 రోజులు సెలవులు. అలాగే.. 16న మిలాద్ ఉన్ నబీ కాబట్టి.. ఆ రోజు సెలవు ఉంటుందనీ, 17న వినాయక నిమజ్జనోత్సవం కారణంగా ఆ రోజు కూడా సెలవు ఉండటం వల్ల వరుసగా 4 రోజులు సెలవులు వస్తాయని విద్యార్థులు భావించారు. అయితే.. తెలంగాణ ప్రభుత్వం ఒక సెలవును రద్దు చేసింది. ఈనెల 14, 15 వ తేదీల్లో సెలవులు అలాగే ఉన్నాయి. కానీ, 16న మిలాద్ ఉన్ నబీ పండుగ తేదీ మారింది. ఈ పండుగను 16న కాకుండా 17న జరుపుకోనున్నారు. దాంతో ప్రభుత్వం కూడా 16వ తేదీన సెలవును రద్దు చేసి.. 17వ తేదీన ఇస్తున్నట్లు ప్రకటించింది. విషయం ఏంటంటే నెలవంక 16న కనిపించినట్లయితే అదే రోజు సెలవు ఉండనుంది. దీంతో వరుసగా 4 రోజులు సెలవులు ఉండనున్నాయి.

# టీచర్లకు హెల్త్ కార్డులు అందచేస్తాం: దామోదర

**తెలంగాణ వీణ/సంగారెడ్డి,సెప్టెంబర్13:** విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సమాజ నిర్మాణం బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉందని దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆందోలు నియోజకవర్గ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రధానోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అందోలు నియోజక వర్గం ఎడ్యుకేషనల్ హబ్ అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. త్వరలో డీఎస్సీ ద్వారా 6,000 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. అలాగే ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను అందజేస్తామని చెప్పారు. ఉద్యోగుల డీఏలు విడుదల చేయాలనే ఆలోచన సీఎం రేవంత్ రెడ్డికి ఉందన్నారు.

# నిబంధనలు లేకుండా తక్షణ సాయం నిధులు

(మొదటి పేజీ తరువాయి)

బృందాలుగా వీడి సభ్యులు పర్యటించి నష్టం అంచనా వేశారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి, కాల్వొడ్డు, బొక్కలగడ్డ, ప్రకాష్ నగర్, మోతీ నగర్‌లోని రాజీవ్ గృహకల్పలో ఓ బృందం పర్యటించింది. అటు, రెండో బృందం నగరంలోని దానవాయి గూడెం, తల్లంపాడు - తెల్దారుపల్లి, ఖమ్మం రూరల్ మండలంలోని తనగంపాడు, ప్రకాష్ నగర్‌లో పర్యటించి వరద నష్టాన్ని అంచనా వేసింది. వరద కారణంగా కోతకు గురైన పొలాలు, ఇసుక మేటలు వేసిన పొలాలను కేంద్ర బృందం పరిశీలించింది. వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలకు దాదాపు రూ.5 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో రహదారులు పూర్తిగా దెబ్బతినగా.. దాదాపు దీని నష్టం రూ.2 వేల కోట్లకుపైగానే ఉంటుందని అధికారులు తెలిపారు. వంతెనల ధ్వంసంతో మరో రూ.700 కోట్ల నష్టం జరిగిందని పేర్కొన్నారు. పంచాయతీ రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్ల పునరుద్ధరణకు దాదాపు రూ.200 కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగడుతున్నారు. వరదల కారణంగా ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లిందని అన్నారు. అటు, విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్ల రిపేర్ల కోసం దాదాపు రూ.150 కోట్లకు పైగానే నిధులు అవసరం అవుతాయన్నారు. అటు, ఏపీ సీఎం చంద్రబాబుతోనూ కేంద్ర బృంద సభ్యులు గురువారం భేటీ అయ్యారు. ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో పర్యటించిన బృంద సభ్యులు వరద నష్టంపై అంచనా వేశారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీఎం చంద్రబాబు కేంద్ర బృందాన్ని కోరారు. వరదల వల్ల ప్రాథమికంగా రూ.6,882 కోట్ల మేర నష్టం వాటిల్లిందని కేంద్రానికి ఇటీవల నివేదిక అందించారు. మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి పాల్గొన్నారు.

# ట్యాంక్ బండ్‌పై నిమజ్జనం లేదు: సీపీ సీవీ ఆనంద్

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:**గణేష్ నిమర్జనం కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. మండపం నిర్వాహకులు పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ సిటీ పరిధిలో 15 వేలు, ఇతర జిల్లాల నుంచి మరో 3 వేల మంది సిబ్బంది పాల్గొంటున్నారని క్లారిటీ ఇచ్చారు. హై కోర్టు ఆదేశాల మేరకు ట్యాంక్ బండ్ పై నిమర్జం లేదని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు లో నిమర్జనం ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరో 8 వేల మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారని తెలిపారు. ఇదే సమయంలో మిలాద్ ఉన్ నబీ ప్రోగ్రామ్ ఉంది మత పెద్దలతో సమన్వయం చేస్తున్నామన్నారు. 17న పబ్లిక్ గార్డెన్ లో ప్రజా పాలన దినోత్సవం కార్యక్రమం, పెరేడ్ గ్రౌండ్లో మరో కార్యక్రమం ఉందని సీపీ ప్రకటించారు. నిమజ్జనకు వచ్చే భక్తులు పోలీసులకు సహరించి, నిబంధనలు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు.**నిబంధనలు ఇవే..** గణేష్ విగ్రహానికి ఒక వాహనాన్ని మాత్రమే అనుమతిస్తారు.విగ్రహాన్ని



తీసుకెళ్లే వాహనంపై లౌడ్స్పీకర్ను అమర్చకూడదు.నిమజ్జనం రోజు వాహనాలపై DJతో కూడిన మ్యూజికల్ సిస్టమ్ను అనుమతించరు.రంగులు పిచికారీ చేయడానికి కాన్ఫెట్టీ గన్లను ఉపయోగించకూడదు.మద్యం మత్తులో ఉన్న వ్యక్తులు లేదా మరేదైనా మత్తు పదార్థాలను కలిగి ఉన్న వ్యక్తులను విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనంలోకి అనుమతించరు.రహదారిపై వెళ్లేటప్పుడు వాహనం ట్రాఫిక్ను ప్రభావితం చేయకూడదు.ట్రాఫిక్కు అంతరాయం కలిగించవద్దు.విగ్రహాన్ని తీసుకువెళ్లే వాహనం ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర లేదా ఇతర వాహనాలకు లేదా ట్రాఫిక్కు అంతరాయం కలిగించే రహదారిపై ఆగకూడదు.అప్పటి పరిస్థితిని బట్టి పోలీసు అధికారులు ఇచ్చే ఆదేశాలపై వాహనాల రాకపోకలు ఆధారపడి ఉంటాయి.ఊరేగింపులో ఎవరూ కర్రలు/కత్తులు, మారణాయుధాలు, మండే పదార్థాలు లేదా ఇతర ఆయుధాలను తీసుకెళ్లకూడదు.జెండాలు లేదా అలంకరణల కోసం ఉపయోగించే కర్రలు 2 అడుగుల పొడవు మించకూడదు. బాటసారులపై వెర్మిలియన్, కుంకుమ లేదా గులాల్ వేయవద్దు.ఊరేగింపులో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు/ రెచ్చగొట్టే ప్రసంగాలు/ నినాదాలు లేదా రెచ్చగొట్టే సంకేతాలు లేదా బ్యానర్లు ఉపయోగించరాదు.ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా ఇతర రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకూడదు.ఊరేగింపు సమయంలో బాణసంచా కాల్చరాదు.పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు ఇచ్చే సూచనలను పాటించండి.ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, 100కి డయల్ చేసి తెలియజేయండి.

# తెలంగాణలో శాంతిభద్రతలు కరువు

(మొదటి పేజీ తరువాయి)

చేయించింది ఎవరు ..? రేవంత్ రెడ్డి, డీజీపీలు కాదా ..? నిన్నటి దాడులు ఎందుకు ఆపలేదు. అది గాంధీ చేసిన దాడి కాదు రేవంత్ రెడ్డి చేసిన దాడి. మమ్మల్ని ఇవాళ హౌజ్ అరెస్ట్ చేశారు. నిన్న గాంధీని ఎందుకు హౌజ్ అరెస్టు చేయలేదు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా. ఖమ్మంలో మా మీద దాడి చేస్తే పది రోజులైనా గుండాల మీద కేసులు పెట్టలేదు. నిన్న జరిగిన దాడికి కర్త,కర్మ, క్రియ అంతా రేవంత్ రెడ్డే. ఆయన డైరెక్షన్ లో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగింది. ఎమ్మర్జ÷న్సీ కన్నా దారుణంగా రాష్ట్ర పరిస్థితులు తయారయ్యాయి.కోమటి రెడ్డి వెంకటరెడ్డి రెచ్చగొట్టే విధంగా మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కొట్టాలని చెప్పడం దారుణం. ఫిరాయింపులపై ఢిల్లీలో ఒక మాట గల్లీలో ఒక మాట మాట్లాడుతున్నాడు. ఎన్నిక లేకున్నా పీఏసీ చైర్మన్ ను నియమించి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం దుర్మార్గం. డీజీపీ పదవి చాలా ఉన్నతమైంది. ఆదర్శంగా ఉండాల్సిన డీజీపీ.. రాజకీయ కుట్రలో భాగమై ప్రతిపక్షాల గొంతును నొక్కాలని చూడాలనుకుంటున్నారు. రాహుల్ గాంధీ దేశం బయట స్వేచ్ఛ స్వాతంత్యాల గురించి పాఠాలు చెప్పడం కాదు. తెలంగాణలో ఏం జరుగుతుందో చూడాలన్నారు. ÷ూజ్యాంగ హక్కులను ఉల్లంఘించి పార్టీ ఫిరాయింపులు జరిగాయి. పీఏసీ చైర్మన్ నియామకం కూడా అలాగే జరిగింది. మీరు మాపై విసిరే రాళ్లే అధికారంలోకి బీఆర్ఎస్ రావడానికి పునాది రాళ్లు. 16వ ఆర్థిక సంఘం గురించి మీరు తప్పుడు లెక్కలు చెబితే, మేము బాధ్యతాయుతంగా బలమైన వాదనను వినిపించాం. ఆంధ్రా నాయకుల మీద రేవంత్ రెడ్డి కపట ప్రేమ వలకబోస్తున్నారు. చిన్న జీయర్ స్వామిని, యాదాద్రి నిర్మాణానికి ప్లాన్ ఇచ్చిన ఆనంద సాయిని ఆంధ్రోడు అని రేవంత్ అన్నారు. మరి దానికి ఏమని సమాధానం చెబుతారు. పీఏసీ చైర్మన్ పదవికి ఎన్నిక జరిగిందని రేవంత్ రెడ్డి చెప్పడం హాస్యాస్పదం. ఎలక్షన్ కాదు, సెలక్షన్ ద్వారా ఇది జరిగింది. కరీంనగర్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో నీ పెత్తనం ఏంటని అరికెపూడి గాంధీ.. కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. దానికి సమాధానంగానే కౌశిక్ రెడ్డి మాట్లాడారు తప్పా? సెటిలర్ల మీద కౌశిక్ కామెంట్ చేయలేదు. ముందు రెచ్చగొట్టింది గాంధీ. ఆయనకు చెప్పిన సమాధానం అది'అని హరీశ్ రావు తెలిపారు. గురువారం జరిగిన తొక్కిసలాటతో తనకు భుజం నొప్పి మొదలైందని.. డాక్టర్లు ఎమ్మారై స్కాన్ తీసి 15 రోజుల పాటు ఫిజియోథెరపీ సూచించారని హరీశ్ వివరించారు.

# జిఎస్టీ గురించి అడిగతే బెదిరింపులా?

(మొదటి పేజీ తరువాయి)

ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన ఆర్థిక మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. సదరు వ్యక్తిపై కేంద్ర ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడిందని, ఇందుకు గాను సీతారామన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తోంది. ఈ ఘటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. అన్నపూర్ణ రెస్టారెంట్ చైన్ యజమాని వ్యవహారంలో నిర్మలా సీతారామన్ తీరు అవమానకరమైనది. పేద మధ్యతరగతి వర్గాల పట్ల జీఎస్టీ పన్ను భూతంలా మారింది. మోదీ ప్రభుత్వ చర్యలతో చిన్న వ్యాపారాల యజమానులు ఆర్థిక దాడులకు గురవుతున్నారు. అధికార అహంకారంతో వారీ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. వస్తువులపై సరళమైన, ఏకరీతి, హేతుబద్ధమైన జీఎస్టీ అవసరమని కాంగ్రెస్ ముందు నుంచి చెబుతోందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ విషయంపై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన బిలియనీర్ స్నేహితులు నిబంధనలను వక్రీకరించడానికి, చట్టాలను మార్చడానికి, జాతీయ ఆస్తులను సొంతం చేసుకోవడానికి ప్రయత్నించినప్పుడు ప్రధాని వారికి రెడ్ కార్పెట్ పరుస్తారు. చిన్న వ్యాపారులు మాత్రం నోట్ల రద్దులు, పన్ను దోపిడులు, జీఎస్టీలను ఎదుర్కొంటున్నారు. చివరికి అవమానాలు కూడా వారికే అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే మాట్లాడుతూ భాజపా తన సభ్యత డ్రైవ్‌లో భాగంగా ఓ సమావేశాన్ని నిర్వహించింది. అన్ని వర్గాల వారిని ఆహ్వానించి మరీ అవమానపరి చారు. భాజపా తమిళనాడు అధికారిక హ్యాండిల్ రెండు వీడియోలను రహస్యంగా రికార్డ్ చేసి షేర్ చేశారు. ఇది వారిని అవమానించినట్లే ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వాధి కారులకు చెప్పుకోకపోతే వారికి కావలసిన విధానపరమైన రూపకల్పనలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఈ వీడియోపై తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో తమిళనాడు భాజపా చీఫ్ కె అన్నామలై బహిరంగ క్షమాపణలు చెప్పారు.

# రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల హౌజ్ అరెస్టులు

**- ప్రజాపాలనలో ప్రతిపక్షాలపై దాడులు దారుణం**

**- ఎమర్జెన్సీ రోజులను అమలవుతున్నాయన్న కెటీఆర్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్, సెప్టెంబర్ 13:** రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతలను పోలీసులు ఎక్కడికక్కడ హౌస్ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న బీఆర్ఎస్ నేతలను అర్ధరాత్రి వరకు అక్రమ అరెస్టులు చేసి.. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా హౌస్ అరెస్టులు చేస్తారా? అంటూ ఆయన ధ్వజమెత్తారు. ప్రజాపాలనలో ప్రతిపక్షాలు మీటింగ్ పెట్టుకోవడానికి కూడా అనుమతి లేదా? అని నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యం అంటూ ఆనాటి ఎమర్జెన్సీ రోజులను అమలు చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. బీఆర్ఎస్ సమావేశం పెట్టుకుంటే ముఖ్యమంత్రికి వెన్నులో వణుకెందుకని కేటీఆర్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలంటే సర్కారుకు ఎందుకింత భయమో చెప్పాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నేతల్ని గృహనిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కేటీఆర్ చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన అరికెపూడి గాంధీ అనుచరులైన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్



చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిని వదిలేసి బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడం ఈ ప్రభుత్వం దిగజారుడు విధానాలకు నిదర్శనమని మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. బీఆర్ఎస్ నేతలపై ప్రభుత్వం జులుం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించ మన్నారు. అప్రజాస్వా మికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ తీరును రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రశ్నిస్తే చాలు ప్రజాప్రతినిధులపై కూడా దాడులకు తెగబడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులకు దిగే సంస్కృతిని తీసుకొచ్చారని మండిపడ్డారు. తెలంగాణ ఇమేజ్ ను డ్యామేజ్ చేసేలా ప్రవర్తి స్తామంటే బీఆర్ఎస్ సహించదని స్పష్టం చేశారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తు న్నారని.. సమయం వచ్చినప్పుడు కాంగ్రెస్‌కి కచ్చితంగా బుద్ది చెబుతున్నారన్నా రు. రాష్ట్ర వ్యాప్తంగా అక్ర మంగా ముందస్తు అరెస్టులు చేసిన తమ పార్టీ నేతల్ని బేషరతుగా విడుద ల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

తెలంగాణ వీణ
తెలంగాణ వీణ ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి 8328209811

# పొన్నం సత్తయ్య గౌడ్ 14వ వర్ధంతి ఘనంగా సంబరాలు...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రవీంద్ర భారతిలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో పొన్నం సత్తయ్య గౌడ్ 14 వ వర్ధంతి సందర్భంగా పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం ప్రధానం -2024 కార్యక్రమం..కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎక్సైజ్ , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమలు ,సాంకేతిక శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు , ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య , ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం, సంజయ్, శ్రీ గణేష్ , వీర్లపల్లి శంకర్ , నాగరాజు , మేఘారెడ్డి , ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ,బీసీ కార్పొరేషన్



చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్,రవాణా రోడ్స్ అండ్ బిల్డింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్ ,బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళభరణం కృష్ణమోహన్ రావు , వెలిచాల రాజేందర్ రావు ,మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్ రెడ్డి ,రచయిత్రి శ్రీ లక్ష్మి ,సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరి కృష్ణ ,మాజీ ఎమ్మెల్యే అరేపల్లి మోహన్ తదితరులు పొన్నం సత్తయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు, ఎమ్మెల్యేలు,ఇతర నేతలు..అనంతరం ప్రముఖ సినీ గేయ రచయిత రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, కళాకారులు కొమురమ్మ, మొగులయ్య లకు పొన్నం సత్తయ్య గౌడ్ జీవన సాఫల్య పురస్కారం - 2024 ను ప్రదానం చేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్,మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు , ఎమ్మెల్యేలు తదితరులు..

# తెలంగాణ సెంటిమెంట్‌తో అరాచకానికి గులాబీ నేతల యత్నం

- మహిళలను అవమానిస్తే నోరుమెదపరా?
- మహిళలకు, ఆంధ్రసెటిలర్స్‌కి క్షమాపణ చెప్పాలి
- కౌశిక్‌ను కట్టడి చేయకుంటే ప్రజాగ్రహమే
- మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ

**తెలంగాణ వీణ/కరీంనగర్:** తెలంగాణ సెంటిమెంట్ ను రాజేసి అరాచకం సృష్టించేం దుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తు న్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, అరికెపూడి గాంధీ మధ్య చోటుచేసుకున్న వివాదమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. పదేళ్లుగా ఆంధ్రా-తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి గొడవలు లేవని, ప్రశాంతంగా కలిసిమెలిసి జీవనం సాగిస్తున్న తరుణంలో ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులను ఇరుప్రాంతాల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో మళ్లీ వైషమ్యాలు సృష్టించేం దుకు కౌశిక్ రెడ్డిని బీఆర్ఎస్



అధిష్టానం పావుగా వాడుకుం టున్నదని, మహిళలను కించపర్చేలామాట్లాడుతున్నా, అరాచకాలకు పాల్పడుతు న్నా కౌశిక్ రెడ్డిపై ఆ పార్టీ అధిష్టానం లేశమాత్రపు చర్యలు కూడా తీసుకోకపోవ డం అనుమానాలకు తావిస్తోం దన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు చీర,గాజులు పంపుతానంటూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ముమ్మాటికీ మహిళలను అవమానించినట్టేనని ఆయన పేర్కొన్నారు. కౌశిక్ కు నోటి దూల ఎక్కువని, మహిళలను అవమానించడం పాడికి పరిపాటిగా మారిందని ఆయన విమర్శించారు. గతంలోనూ మాజీ గవర్నర్ ను కూడా కించపర్చేలా మాట్లాడారని డాక్టర్ కవ్వం పల్లి గుర్తు చేశారు. కౌశిక్ రెడ్డి అరాచకవాదిగా మారిపోయా డని, ఆయన ఆగడాలు రోజురోజుకు పెచ్చుమీరి పోతున్నా కేసీఆర్ కుటుంబం గాని, గులాబీ నాయకులు ఎందుకు కట్టడి చేయలేకపో తున్నారని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో సబితా ఇంద్రారెడ్డిపై సీఎం చేసిన వ్యాఖ్యకు అనర్థవంతమైన రగడ చేసిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు. ముఖ్యంగా మహిళలను అవమానపర్చేలా కౌశిక్ రెడ్డి చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యలపై కల్వకుంట్ల కవిత ఎందుకు స్పందించడం లేదని, ఆమె మౌనం వెనుక అంతరార్థ మేమిటని డాక్టర్ కవ్వంపల్లి ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికైనా గులాబీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని, అదే విధంగా కౌశిక్ ను కట్టడి చేయకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని డాక్టర్ కవ్వంపల్లి హెచ్చరించారు.

# ప్రిన్సిపాల్‌ను సన్మానించిన జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి

**తెలంగాణ వీణ/కోరుట్ల, సెప్టెంబర్ 13:** జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్ట ణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కే.వేంకయ్యను జగి త్యాల జిల్లా జాతీయ సేవ పథకం ( ఎన్ ఎస్ ఎస్) నోడల్ అధికారి డాక్టర్ పడాల తిరుపతి గురువారం సాయంత్రం శాలువాతో ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఒక ప్రిన్సిపాల్ గా పని చేయడం అభినందనీయమని గుర్తు చేస్తూ,ఆయన చేసిన సేవ లకు ఫలితం ఇప్పుడు లభిం చిందని అన్నారు.దాదాపు 35 సంవత్సరాల నుంచి కోరుట్ల,మెట్ పల్లి పట్టణాలలోని విద్యార్థులకు విద్యాభ్యాసం చేస్తున్నారని ఆయ న గుర్తు చేశారు. విద్య, వైద్య, ఆరోగ్య, పోలీసు, రెవె న్యూ,ఎక్సైజ్,ఆర్థిక, పంచాయ తీరాజ్ తదితర శాఖలలో ఆయన విద్యార్థులు వివిధ హోదాలలో పని చేస్తున్నారని స్పష్టంగా



పేర్కొ న్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణన్ 136 వ జయంతిని పురస్క రించుకుని ఉపాధ్యాయ దినోత్స వం సందర్భంగా ఇటీవల హైదరా బాద్ లోని రవీంద్ర భారతిలో జరిగిన వల్లూరి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో గురు బ్రహ్మ - 2024 అవార్డును ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేంకయ్య అందుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారిగా రాష్ట్ర స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని, అందుకు ఉదాహరణగా ఈ - టీ వీ లో "యువ" కార్యక్రమం ప్రసారం కావడమేనని అన్నారు. భవిష్య త్తులో ప్రిన్సిపాల్ వేంకయ్య మరె న్నో అవార్డులను అందుకొని, అందరికీ ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎన్ ఎస్ ఎస్ నోడల్ అధికారి పడాల తిరుపతి ఆకాంక్షించారు. జిల్లా ఎన్ ఎస్ ఎస్ నోడల్ అధికారి డాక్టర్ పడాల తిరుపతి తనను సన్మానించడం పట్ల ప్రిన్సిపాల్ వేంకయ్య హర్షం వ్యక్తం చేశారు.

# దేశ చరిత్రలో బీసీలకు తీవ్ర అన్యాయం

- ఇక సహించేది లేదు - బీసీల వాటా ఇవ్వాల్సిందే.. - బిసి విద్యార్థి ఉద్యోగ వివిధ సంఘాల సమావేశంలో ఆర్ కృష్ణయ్య..

**తెలంగాణ వీణ/విద్యానగర్:**దేశ చరిత్రలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. ఇక సహించేది లేదని బీసీల వాటా బీసీలకు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్ బిసి భవన్ లో బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గవ్వల భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆర్ కృష్ణయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య ను శాలువాతో సత్కరించి భారీ కేక్ కట్ చేపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గవ్వల భరత్ కుమార్ మాట్లాడుతూ దేశానికి ఉత్పత్తులు అందించే బీసీలు విద్యార్థులు, ఉద్యోగులు సబ్బండ వర్గాలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన పాలకులు 76 సంవత్సరాలుగా అన్యాయం చేస్తూనే ఉన్నారని విమర్శించారు. బీసీల జనాభాకు అనుగుణంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధితో పాటు రాజకీయంగా వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు.



దేశవ్యాప్తంగా బీసీ రిజర్వేషన్లపై చర్చ జరుగుతుందని ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. బీసీ జాతి అభివృద్ధి కోసం ఆర్ కృష్ణయ్య పోరాడుతూనే ఉన్నారని ఇకముందు కూడా వారితో పోరాటం చేస్తామన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశంలో బీసీలు కూడా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ప్రధాని నరేంద్ర మోడి చొరవ తీసుకొని వెంటనే పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి చట్టసభలో 50% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపరిచి బీసీలకు విద్య అందే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీసీల ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, వెంకటేష్, అనంతయ్య, గొరిగి మల్లేష్ యాదవ్, నందగోపాల్, రాజ్ కుమార్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో 82 డెంగ్యూ కేసులు



**తెలంగాణ వీణ/కమాన్ పూర్, సెప్టెంబర్ 13:** పెద్దపల్లి జిల్లాలో జ్వరాలతో బాధపడేవారి సంఖ్య రోజురోజుకు పెరుగు తోంది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు 82 డెంగ్యూ కేసులు, 2 చికెన్ గున్యా కేసులు నమోదయ్యాయి. 5,39,056 ఫీవర్ సర్వే చేయాల్సిన గృహాలు ఉండగా.. ఇప్పటివరకు 1,58,685 నివాసాల్లో స్క్రీనింగ్ చేశారు. ఇప్పటివరకు మొత్తం జిల్లాలో 6,585 జ్వర పీడితులు ఉన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

## 20 కేజీల గంజాయి పట్టుకున్నట్లు ఏసీపీ శ్రీనివాస్ జీ తెలిపారు



**తెలంగాణ వీణ/కమాన్ పూర్, సెప్టెంబర్ 13:** హుజూ రాబాద్ బస్టాండ్లో శుక్రవారం 20 కేజీల గంజాయి పట్టుకున్న ట్లు ఏసీపీ శ్రీనివాస్ జీ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లా డుతూ ఒడిశాకు చెందిన అర్జున్ తనుగుల, సుభాష్ సీసా ఐదారేండ్లుగా అక్కడే గంజాయి పండిస్తూ ఇక్కడి దళారులకు అందించేవారు. స్వయంగా తామే అమ్మితే ఎక్కువ డబ్బు వస్తుం దన్న ఆశతో ఒడిశా నుంచి విశాఖపట్టణం మీదుగా వరంగల్ చేరుకున్నారు. అక్కడి నుంచి బస్సులో హుజూరాబాద్ బస్టాండ్కు చేరుకున్నారు. పక్కా సమాచారంతో సీఐ తిరుమల్ గౌడ్, ఎస్ఐ యూనస్ మహ్మద్ అలీ సిబ్బందితో కలిసి బస్టాండ్లో వారిని అదుపులోకి తీసుకున్నారు. 20 కేజీల గంజాయి స్వాధీనం చేసు కున్నట్లు ఏసీపీ తెలిపారు. గంజాయిని పట్టుకున్న సీఐ, ఎస్సైతో పాటు పోలీస్ బృందానికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## బాలకిషన్ నగర్‌లో ఘనంగా వినాయక పూజలు



**తెలంగాణ వీణ/కోరుట్ల సెప్టెంబర్ 13:** మెట్ పల్లి పట్టణం లోని 13వ వార్డు లో బాలకిషన్ నగర్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక మండపం లో ప్రత్యేకంగా విఘ్నేశ్వర స్వామి వారికి 51 రకాల ప్రసాదాలు మరియు సరస్వతి పూజ పురో హితులు రమణాచారి వేదమం త్రాలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు తోట ప్రవీణ్, చొప్పరి శ్రీని వాస్ ,సంబారి శ్రీనివాస్, చందన గిరి రమేష్ ,యాద గిరి ,తోట ప్రసాద్, ప్రవీణ్ నవీన్, శ్రీకాంత్, మిట్టి పత్రి శంకర్ మత్రి మహేష్ హరిబాబు కృష్ణకమిటీ సభ్యులు మహిళలు పాల్గొన్నారు

## ముసాయిదా ఓటర్ జాబితా విడుదల

**తెలంగాణ వీణ/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేసిన స్పెషల్ ఆఫీసర్ వెంకటశివ ప్రసాద్..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14 నుండి 21వ తేదీ వరకు ఓటర్ లిస్ట్ లో పేర్లు గాని ఓటర్ జాబితాలో తప్పులు ఉంటే సరి చేసుకోవాలని తెలిపారు..ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి నేరేడుకొమ్మ సాగర్ రావు, కరోబర్ రేచవేని ఆంజనేయులు,ఆశ వర్కర్లు, అంగన్వాడి సిబ్బంది,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# శ్వేతార్కమూల గణపతి దేవాలయంలో ఘనంగా కుంకుమ పూజలు

● ముగ్గురమ్మల అనుగ్రహంతో పులకించిన మహిళలు





**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి: సెప్టెంబర్ 13:** కాజీపేట స్వయంభు శ్రీ శ్వేతార్కమూల గణపతి దేవాలయ దివ్య క్షేత్రంలో జరుపబడుతున్న నవరాతోత్సవకళ్యాణోత్సవ వేడుకలలో భాగంగా.. శుక్రవారం దేవాలయంలో మహిళలంతా సామూహికంగా పాల్గొని కుంకుమార్చన పూజలను నిర్వహించారు. మహిళలంతా ఒకరికొకరు గౌరమ్మలు ఇచ్చి పు చ్చుకొని, పసుపు కుంకుమలతో వస్త్రములను వాయినముగా పంచుకొని, వేడుకలు నిర్వహించు కొన్నారు. మూడు రోజులపాటుగా కొనసాగుతున్న జ్యేష్టాదేవి పూజలో భాగంగా శుక్రవారం కుంకుమార్చన తో జ్యేష్టాదేవి పూజను పూర్తి చేశారు. బ్రహ్మశ్రీ కులకర్ని మహేశ్వర శర్మ,జ్యోషి మల్లికార్జునశర్మ, గ జవాడ అనంతశర్మ, అయినవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో జ్యేష్టా దేవికి ఉద్వాసన పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష కుంకుమార్చనను చేశారు. ఈ సందర్భంగా మహిళలు చక్కటి మంగళహారతులను గానం చేసి. భక్తులను పులికింపచేశారు. పగలు పూజా కార్యక్రమాల ఇన్చార్జి తుమ్మ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ పూజలు జరిగాయి. ఈ సందర్భంగా జ్యోషీ మల్లికార్జున శర్మ భక్తులనుదేశించి మాట్లాడుతూ.. దేవాలయంలో ప్రతి సంవత్సరం ముగ్గురమ్మలను కలిపి కుంకుమ పూజ చేసే అవకాశం ఈ క్షేత్రంలోనే వస్తుందని. ఈ సంవత్సరం కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమార్చన నిర్వహించడం ఆనందంగా ఉందని తెలియజేశారు. అయినవోలు రాధాకృష్ణ శర్మ మాట్లాడుతూ.. అష్ట దరిద్రాన్ని తొలగించే జ్యేష్టా దేవి పూజ చేయడం ఇక్కడ ఆచరణగా వస్తుందని, చాలామంది భక్తులు లక్ష్మీదేవి అనుగ్రహం కోసం ఇక్కడ పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ముందుగా చండీ హెూమం నిర్వహించుకొని జ్యేష్టా దేవి అమ్మవారి ఉద్వాసన చేసుకుని ఎంతోమంది మహిళలు ఈ విధంగా కుంకుమార్చనలు చేసుకోవడం ఎంతో విశేషమని అమ్మవారి అనుగ్రహంతో సంపూర్ణమైనటువంటి దారిద్రం పోతుందని భక్తులకు అమ్మవారి అనుగ్రహం ఇదే విధంగా భక్తితో చేసినట్లయితే తప్పకుండా ఆ ముగ్గురమ్మల యొక్క అనుగ్రహముతో సిరిసంపదలు కలుగుతాయని వివరించారు. నాలుగు గంటలకు మహాలింగా అర్చన కార్యక్రమాన్ని జరిపారు. పూజల అనంతరం భక్తులు అన్నపూర్ణ భవన్ లో అన్నదానంలో పాల్గొన్నారు.

# సీతారాం ఏచూరికి వరంగల్ బార్ అసోసియేషన్ ఘన నివాళి





**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13:** ప్రముఖ కమ్యూనిష్టు, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, జేఎన్ యూ పూర్వ విద్యార్థి నేత కామ్రేడ్ సీతారాం ఏచూరికి వరంగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ హాల్లో ఘన నివాళి అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్ మాట్లాడుతూ మాట్లాడుతూ.. పీడిత, తాడిత అణగారిన వర్గాల వైపు నిలబడి గొంతుకై ఎలుగెత్తిన వామపక్ష యోధుడు కామ్రేడ్ ఏచూరి అని కొనియాడారు. కార్మికుల కోసం, కర్షకుల కోసం నిరంతరం పోరాటాలు చేసిన యోధుడని, ఏచూరి మరణం వామపక్షాలకు తీరని లోటనిఅన్నారు. విద్యార్థి దశ నుండి రాజకీయాల్లో అడుగుపెట్టినదాదాపు నాలుగు దశాబ్దాలకు పైగా జాతీయ రాజకీయాలలోఆయన క్రియాశీలంగా వ్యవహరించారని గుర్తు చేశారు. దేశ రాజకీయాలలో చరిత్ర సృష్టించిన మహా నాయకుడు ఏచూరి అని అన్నారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్ హనంకొండ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లాడే రమేష్, బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి షేక్ నబి, న్యావదులు గంజి గణేష్, కొత్త పెల్లి చిరంజీవి, డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, షేక్ రఫీ, సిరిమల్ల అరుణ తో పాటు రాజు విక్రం తదితరులు పాల్గొన్నారు.

# మ్యాప్ రీడింగ్ ఈవెంట్‌లో ఎండి అఫ్రోజ్ 1వ స్థానం (గోల్డ్ మెడల్) కైవసం

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13:** తాళ్ల పద్మవతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థి, ఎన్ సి సి క్యాడెట్ జాతీయ స్థాయి 1వ బహుమతిని గెలుచుకున్నారు. తాళ్ల పద్మావతి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సోమిడి, కాజీపేట విద్యార్థి ఎండి అఫ్రోజ్ మ్యాప్ రీడింగ్ ఈవెంట్‌లో 1వ స్థానం (గోల్డ్ మెడల్) కైవసం చేసుకున్నారు. ఆల్ ఇండియా థాల్ సైనిక్ క్యాంప్ 2024 న్యూ ఢిల్లీలోని డి జీ ఎన్ సి సి పరేడ్ గ్రౌండ్‌లో జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డైరెక్టరేట్ తరపున ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరం 02-09-2024 నుండి 12-9-2024 వరకు నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఛైర్మన్ తాళ్ల మల్లేశం కళాశాలకు చెందిన ఎన్‌సిసి 1(టి) బెటాలియన్ మొత్తం బృందాన్ని మరియు ముఖ్యంగా ఎండీ అఫ్రోజ్ తన అద్భుతమైన కృషిని, అద్భుతమైన విజయాన్ని సాధించినందుకు అభినందించారు. డైరెక్టర్లు డాక్టర్ తాళ్ల మల్లేశం- చైతన్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వేలు, డాక్టర్ విజయలక్ష్మి, మహేందర్ రెడ్డి, భాగ్య లక్ష్మి, ఇతర సిబ్బంది, విద్యార్థులు ఈ విజయం కోసం ఎండీ అఫ్రోజ్, అతని తల్లిదండ్రులు, మొత్తం టి పి సి ఇ బృందాన్ని అభినందించారు.





# గణనాథుడిని దర్శించుకున్న వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య



**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13 :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ, నక్కలగుట్టలో జి డబ్ల్యూ ఎం సి కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హనుమకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి మండపాన్ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సందర్శించి, గణనాథున్ని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ కడియం కావ్య స్వయంగా భక్తులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. వాడవాడనా కొలువుదీరిన గణనాథుల ఆశీర్వాదం ప్రజలకు ఉండాలని కోరారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి రైతన్నలు ఆనందంతో గడపాలని గణపతిని ఎంపీ డా.కడియం కావ్య ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో జి డబ్ల్యూ ఎం సి హనుమకొండ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాలలో వసతుల కల్పనపై కలెక్టర్ దృష్టి

● కమలాపూర్ బాలికల వసతి గృహంలో విద్యార్థినిలతో కలిసి రాత్రి నిద్ర

● క్రీడలు, మెడిటేషన్ తో విద్యార్థినులలో ఉత్సాహం నింపిన కలెక్టర్







**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13 :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల నందు రాత్రి బస అనంతరం శుక్రవారం ఉదయం విద్యార్థినులతో కలిసి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పాఠశాల మైదానంలో రన్నింగ్, వార్మప్, మెడిటేషన్ చేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి కలెక్టర్ వాలీబాల్, షటిల్ ఆడి విద్యార్థినుల్లో ఉత్సాహాన్ని నింపారు. పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులతో కలిసి కలెక్టర్ మొక్కను నాటారు. విద్యార్థులకు ఉదయం అందించే అల్పాహారంలో భాగంగా కలెక్టర్ విద్యార్థినులతో కలిసి రాగి జావా, టిఫిన్ చేశారు. డైనింగ్ హాల్ కు సంబంధించిన రిజిస్టర్స్, ఫుడ్ మెనూ, మెడికల్, తదితర రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వసతుల కల్పన, వారికి అందించే ఫుడ్ మెనూ స్వయంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడంతో పాటు వారి రోజువారి దినచర్య ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు రాత్రి బస చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గురువారం కమలాపూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థునులతో మాట్లాడి రోజువారి దినచర్య లో భాగంగా మెనూ, వసతి, పుస్తకాలు, దుస్తుల గురించి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. ఫుడ్ విషయంలో ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. విద్యార్థినులు కూడ తమకు మంచి భోజనం అందిస్తున్నారని, విద్యా విధానం చాలా బాగుందని విద్యార్థినులు తెలిపారని కలెక్టర్ పేర్కొన్నారు. కాగా స్కూల్, కాలేజీ కు ఏమైనా అవసరం ఉన్నాయా అని కలెక్టర్ అడుగగా విద్యార్థినులు బెంచీలు, కాంపౌండ్ వాల్సు తదితర మరమ్మతుల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రతిపాదనలు పంపాలని ప్రిన్సిపల్ ను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్ కుమార్, ప్రిన్సిపల్ సౌజన్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణవేణి, పీఈటీ సంగీత, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# తెరవని అంగన్వాడి కేంద్రాలు

● పస్తులున్న పిల్లలు

**తెలంగాణ వీణ/భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,దమ్మపేట, సెప్టెంబర్ 13:** తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శిశు సంక్షేమ శాఖ కు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ఐసిడిఎస్ ద్వారా అందించే పోషకాహారం పిల్లలకు అందని ద్రాక్షలా మారింది. అంగన్వాడి టీచర్లు తమ కేంద్రాల ద్వారా పిల్లలకు పోషకాహారం అందించాలి. ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపమొ లేక టీచర్ల అలసత్వమా...! తెలియదు గాని పసిపిల్లలు మాత్రం పస్తులు ఉండక తప్పడం లేదు. దమ్మపేట మండలంలోని పట్వారి గూడెం సెక్టార్లు ఉన్న కొన్ని అంగన్వాడీ కేంద్రాలు మూతపడి ఉండటం స్థానికులుఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుధా పల్లి, ఎర్ర గుంపు, పార్కలగండి 1,2, ఆర్లపెంట అంగన్వాడి కేంద్రాలు తాళాలు వేసి మరి మూతపడి ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో గర్భిణీ స్త్రీలు బాలింతలు పిల్లలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. ఆర్లపెంట అంగన్వాడి సెంటర్ 11 గంటల వరకు తెరుచుకోలేదు, 11 గంటల తర్వాత తెరిచారు.కేంద్రంలో పిల్లలు లేరు వంట వండనే లేదు, ఎర్ర గుంపు అంగన్వాడీ కేంద్రం అసలు తెరవలేదు. సుధా పల్లి అంగన్వాడి సెంటర్ మూతపడి బోసురు మంటూ కనిపించింది. దీంతో పిల్లలకు పౌష్టికాహారం అందలేదు. అంకంపాలెం లో అంగన్వాడి సెంటర్ తెరిచి ఉన్న ఫీడింగ్ పిల్లలకు పెట్టలేదు. దీంతో సూపర్వైజర్ వివరణ కోరగా.... టీచర్లు అందరూ సెలవులు పెట్టారు.. సెలవులు పెడితే అంగన్వాడీ కేంద్రాలు ఎలా తీస్తారండి అని సమాధానం ఇచ్చారు. అంగన్వాడి సెంటర్ల ద్వారా సమన్వయ లోపంతో పిల్లలకు ఫీడింగ్ అందకపోవటం పై చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుకుంటున్నారు.






# దోబీ ఘాట్‌ను నిర్మించి రజకులకు అప్పగించాలి: మున్సిపల్ డిసి రాజుకు వినతి




**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** జ్యోతి నగర్‌లో దోబీఘాట్ నిర్మించి రజకులకు అప్పగించాలని గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ ప్రతిపాదన ఉత్తరం రాయడం జరిగిందని ఆ ఉత్తరాన్ని అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జి.హెచ్.ఎం.సి .డిప్యూటీ కమిషనర్ రాజు కి , అందజేశారు. మల్కాజిగిరి లో నివసిస్తున్న రజక వృత్తిని జీవనోపాధిగా చేసుకుని జీవిస్తున్న రజక కుటుంబాలకు 1985లో జ్యోతి నగర్ లో దోబీ ఘాట్ లు ప్రభుత్వం వారే దోబీ ఘాట్ నిర్మించి ఇవ్వడం జరిగిందన్నారు .కొన్ని సంవత్సరాల తర్వాత అది శిథిలావస్థకు చేరుకోవడం జరిగింది .ఆ స్థలంలో తిరిగి మరల ధోబి ఘాట్ నిర్మించి ఇవ్వాలని కార్పొరేటర్ కమిషనర్ ని కోరడం జరిగింది దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారు .కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు పి పాండు, కార్యదర్శి కాసర్ల నాగరాజు ,సి.పి.ఐ.నాయకులు రొయ్యల కృష్ణమూర్తి ,ఎస్.కె అజీజ్ కాంగ్రెస్ జీడి నవీన్ గౌడ్ ,టిడిపి నాయకులు వగ్గు చంద్రశేఖర రావు, కరణం గోపి, బత్తిని నరసింహ గౌడ్, నాయకులు జనసేన నాయకులు జీనుకుంట్ల రమేష్ బీఎస్పీ నాయకులు గౌతమ్ రాజు, సిపిఎం నాయకులు నర్సింగరావు ,రజక సంఘం నాయకులు పి సత్యనారాయణ ,జి సాయి తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కార్యకర్తలను, ప్రజలను కలవనివ్వరా..!

- పోలీసుల నిర్బంధంలో దాస్యం వినయ్ భాస్కర్!

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి: సెప్టెంబర్ 13:** పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై దాడి, మాజీ మంత్రులు అరెస్టులు, నిర్బంధాలు, వారి పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుకు నిరసనగా... బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న క్రమంలో దాస్యం వినయ్ భాస్కర్ ని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలను, ప్రజలను కలవనివ్వరా..? అని పోలీసులను ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలోకి వచ్చేవారి వివరాలు ఎందుకు తీసుకుంటున్నారని, పార్టీ కార్యాలయం గేట్లను ఎందుకు మూసివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమని అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం హైదరాబాద్ వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్ది సేపు పోలీసులకు, పార్టీ శ్రేణులకు వాగ్వాదం జరిగింది.

# గణేష్ విఘ్నేశ్వరుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

- అన్నదాన కార్యక్రమాలలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**తెలంగాణ వీణ/హనుమకొండ ప్రతినిధి, సెప్టెంబర్ 13:** స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో గణేష్ నవ రాత్రులను పురస్కరించుకొని, ముందుగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గణనాధునికి ప్రత్యేక పూజలు చేసి, విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదాన ప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలో వినాయక మండపాలను సందర్శించి గణనాథులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వినాయక మండపాల నిర్వాహకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







# దేశ రాజకీయాలలో 'చెదరని ముద్ర'కామ్రేడ్ ఏచూరి

**- వామపక్షప్రజాస్వామిక ఉద్యమాలకు తీరని లోటు**

**- సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్**



**తెలంగాణ వీణ/ఓయూ:** సాధారణ కార్యకర్త నుండి అంచలంచెలుగా ఎదిగి దేశ రాజకీయాలలో చెదరని ముద్ర గా కామ్రేడ్ ఏచూరి నిలిచిపోయారని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ కొనియాడారు.ఢిల్లీ ఎయిమ్స్ హాస్పిటల్ లో ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ తుది శ్వాస విడిచిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరీ చిత్రపటానికి సిపిఐ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ..తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు నిలబడి పాలకవర్గాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహించారు, అదేవిధంగా వామపక్షాల ఐక్యత, బలోపేతానికి అహర్నిశలు కృషి చేశారు అని కొనియాడారు.దేశంలో బిజెపి అవలంబిస్తున్న ప్రజా, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే అసలైన నివాళు లని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలోసిపిఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజు, శ్రీహరి, గువ్వల మల్లేష్, రవికాంత్, సయ్యద్ గౌస్, యాదగిరి, రవి, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సు ఢీకొని బాలిక మృతి



**తెలంగాణవీణ/దుండిగల్:** దుండిగల్ మల్లంపేటలోని ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు కిందపడి నాలుగు సంవత్సరాల చిన్నారి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.... మల్లంపేట గ్రామంలో కిరాణం షాపు నిర్వహించుకుని జీవనం సాగిస్తున్న రాజుకు ఇద్దరు కుమార్తెలు వీరు స్థానికంగా వుండే లీఫ్ స్కూల్ లో చదువుతున్నారు , రోజు మాదిరిగానో శుక్రవారం ఉదయం స్కూల్ కి వెళ్తుండగా స్కూల్ ఆవరణంలో బస్సు దిగిన బాలికలు పాఠశాలలోకి వెళ్తున్నారు. రాజు చిన్న కుమార్తె కుంట మన్విత లోపలకి వెళ్తుండగా స్కూల్ బస్సు ఢీ కొట్టింది. తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ బాలిక మృతిచెందింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతి చెందిందంటూ పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చిన్నక్రాంతి కాలనీలో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్



**తెలంగాణ వీణ/తార్నాక:** జిల్లా చిన్నక్రాంతి కాలనీలో కాంట్రాక్టర్ సంపత్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... నూతన సీసీ రోడ్ల నిర్మా పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు.అదేవిధంగా కాలనీ మెయిన్ లైన్ లో కూడా దసరా లోపు సీసీరోడ్డు పనులు ప్రారంభించి.. పూర్తి అయ్యేలా చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత కాంట్రాక్టర్ కు సూచించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు గొరిగే నర్సింహా కురుమ, సింహా చారి,వెంకటేష్ గౌడ్,అంజయ్య,శివరాత్రి నరేష్,అశోక్ కురుమ,నల్లగంటి నరేష్, పరమేశ్ యాదవ్, విక్రమ్ గౌడ్,మస్తాన్ భాస్కర్,మల్లేష్ కురుమ, నరేష్ గౌడ్, సందీప్,వెంకట చారి,హరి ప్రసాద్, యకస్వామి కురుమ,శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండపంలో గణపతికి ప్రత్యేక పూజలు....

**- కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్**



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** వినాయక నవరాత్రులను పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సాయి పూరి కాలనీలో విఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక మండపం వద్ద స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శుక్రవారం హాజరై గణేష్ మహారాజ్ ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్,వి ఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధులు శశాంక్, రేవంత్, ఆదర్శ్, రోహిత్, మ యూరేష్, సుధీర్, సుమంత్, జస్వంత్, వర్షిత్, ధనుష్, తులసి, అశ్విత, శ్రావణి, రవీనా, నేహా, సంజన పాల్గొన్నారు.

## గణనాధుడు లడ్డు వేలం పాటలో 25000లకు దక్కించుకున్న రమాకాంత్ రెడ్డి..



**తెలంగాణ వీణ/తార్నాక:** హబ్సిగూడ కాకతీయ నగర్ గణనాథుడు హిందూ జన జాగరణ సమితి ఆధ్వర్యంలో శోభాయాత్ర కోలహాలలాతో నిర్వాహించారు. కాకతీయ నగర్ గణ నాథుడు లడ్డు వేలం పాటలో పాల్గోని స్వామి వారి లడ్డు 25 వేలు రూపాయలు దక్కించుకున్న రమాకాంత్ రెడ్డి.. గణనాదుని శోభయాత్రతో పాల్గొనీ బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే మేడ్చెల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి హబ్సిగూడ మాజీ కౌన్సిలర్ కైలాసపతి గౌడ్ హిందూ జన జాగరణ సమితి ఆర్గనైజర్ శివ శైలేందర్, కమిటీ సభ్యులు బొమ్మగోని రఘుపతి గౌడ్, అల్కాపురి సురేష్, మధుమోహన్ రెడ్డి, రమాకాంత్ రెడ్డి, వెంకటేష్ కట్ట భాస్కర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి బెస్ బాల్ పోటీలకు కంజర్ విద్యార్థినులు



**తెలంగాణ వీణ/హైదారాబాద్:** నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం సుద్దపల్లి లో ఈ నెల 8 న జరిగిన బాలికల జిల్లా జూనియర్ బేస్ బాల్ జట్ల ఎంపిక లోచక్కని ప్రతిభ కనబరచి ఈ నెల 14నుండి16 వరకు ఎన్ టీ ఆర్ స్టేడియం నిర్మల్ లో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు మోపాల మండలం కంజేర్ గ్రామ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కంజర గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఉదయ శీల,వ్యాయామ ఉపాధ్యాయురాలు నల్లూరి లతలు మాట్లాడుతూ కంజరకు చెందిన స్పందన,చంద్రహసిని,స్పందన లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యా రని తెలిపారు.ప్రిన్సిపల్ విజయ విద్యార్థులను అభినందిస్తూ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల సంతోషం వ్యక్తపరిచారు.రాష్ట్రంలో విజేతలుగా నిలవడానికి కృషి చేయాలన్నారు.

## అన్నదాన కార్యక్రమం

**- ప్రారంభించిన కార్పొరేటర్ శ్రావణ్ కుమార్**



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** GHMC ప్రధాన కార్యాలయం లో కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతికి పూజ కార్యక్రమం లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. పాటు గుంఫౌంద్రి కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్ సింగ్, రవీందర్ రెడ్డి, సతీష్, రాజకుమార్ మరియు GHMC పలు డిపార్ట్మెంట్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి ఖబర్దార్..

**- మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సతీష్ కుమార్**



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** తెలంగాణ రాష్ట్రంలో అన్నదమ్ముల్లాగా కలిసి మెలిసి ఉంటున్నా ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజల మధ్యలో చిచ్చు పెట్టాలని చూస్తున్న చెత్త వెధవ కు పాడె కడతాం అని మల్కాజిగిరి కాంగ్రెస్ సీనియర్ నాయకులు సతీష్ ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కయ్యానికి కాలు దూవి కావాలనే మా నాయకులను రెచ్చగొడుతూ నీ ఉనికిని చాటుకోవాలనే ప్రయత్నం మానుకో అని ఆయన హెచ్చరించారు.10 సంవత్సరాల మీ అరాచక పాలనను చీ కొట్టి మిమ్మల్ని ఇంట్లో కూర్చోబెట్టిన బుద్ధి రావడం లేదంటే మీరేంటో అర్థం అవుతుందని ఆయన ఆరోపించారు. తొలి దశ మలిదశ తెలంగాణ ఉద్యమంలో లక్షలాది మంది ఆంధ్రకు చెందిన వారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం సహకరించి తెలంగాణ రాష్ట్రద సాధనలో కీలక పాత్ర పోషించిన వారిని నీ స్వార్థం విడగొట్టాలని చూస్తే నిన్ను తరిమి తరిమి కొడతాం అన్నారు. నీ రాజకీయ స్వార్థం కోసం మొన్న జరిగినటువంటి ఎన్నికలలో భార్యాబిడ్డలను రోడ్డుపైకి తీసుకువచ్చి ఓట్లు వేయకపోతే చచ్చిపోతామంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి గెలిచిన నీవు నీతులు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఎద్దవ చేశారు. చివరిగా ఒకటే మాట ఖబర్దార్ కౌశిక్ రెడ్డి ఇకనైనా నీ రాజకీయ ఎత్తుగడలు మానుకో లేదంటే నీ రాజకీయ భవిష్యత్తు ఉండదని ఆయన హెచ్చరించారు.


## జిల్లా పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను పంపిణీ: డి ఎం శ్రీధర్

**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** మల్కాజిగిరి జిల్లా పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి ఉడత భక్తిగా ఏ డి సి నరసింహ, మహమ్మద్ రషీద్, శ్రీను, ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు సంవత్సరం పాటు ఉచిత బస్ పాస్ లను శుక్రవారం పాఠశాల ప్రిన్సిపల్ విల్లియమ్స్ సమక్షంలో రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్ చేతుల మీదగా 100 మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందజేశారు .ఈ సందర్భంగా రాణిగంజ్ డి ఎం శ్రీధర్ మాట్లాడుతూ, కొంతమంది పేద విద్యార్థులు రవాణా సౌకర్యం లేక మధ్యలోనే చదువు మానేస్తున్నారని, అలాంటి విద్యార్థులకు చేయూతనివ్వడానికి తమ సిబ్బంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను అందజేయాలని మంచి ఆలోచనతో ముందుకు వచ్చిన తమ సిబ్బందిని అభినందించారు. విద్యార్థులు బస్సులు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ విలియంస్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు బస్సు పాసులు అందజేసిన రాణిగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్, వారి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రాణిగంజ్ డిఎం శ్రీధర్, ఎడిసి నరసింహ, మహమ్మద్ రషీద్, శ్రీను, ధర్మేందర్, కండక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## గణేష్ మండపాన్ని సందర్శించిన కార్పొరేటర్ దంపతులు..

**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** డిఏ ఈ కాలనీ , ఆర్టీసీ కాలనీ ఈస్ట్ ప్రగతి నగర్‌లోని వివేద గణేష్ మండపాలని సందర్శించిన మల్కాజ్గిరి బిజెపి సీనియర్ నాయకుడు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. నిర్వాహకులు చంద్రశేఖర యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.



# సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటు


**- ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్**

**తెలంగాణవీణ/కాప్రా:** ఎస్ఎఫ్ఐ జాతీయ మాజీ అధ్యక్షుడు కామ్రేడ్ సీతారాం ఏచూరికి ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఘన నివాళులర్పించింది. గొప్ప సైద్ధాంతిక నిబద్ధతగల నేత,మార్క్సిస్టు మేధావి,ఉత్తమ పార్లమెంటేరియన్, సామాజిక,ఆర్థిక, రాజకీయాంశాలపై అనర్గళంగా మాట్లాడిగలిగిన ఏచూరి కన్నుమూయటం పట్ల తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. దేశం అత్యంత సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ఆయన మరణంతో పెద్ద దిక్కును కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ పూర్వ జాతీయ అధ్యక్షులు సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ విద్యార్థులతో కలిసి ఆయన మరణానికి సంతాపాన్ని ప్రకటించింది.1974లో ఎస్ఎఫ్ఐ లో చేరిన సీతారాం ఏచూరి జేఎన్ యూ లో చేరి యూనివర్శిటీ సమస్యలపై పోరాడారనీ, ఎమర్జన్సీ కాలంలో విద్యార్థి హక్కులపై పోరాడుతూనే నాటి ప్రధాని ఇందిరాగాంధీ ముందు ధైర్యంగా నిలబడి కొట్లాడారని, 1977-78 వరుసగా 3 సార్లు జేఎన్ యూ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. 1984లో జాతీయ అధ్యక్షులుగా పనిచేశారని ఆ కాలంలో దేశంలో ఎస్ఎఫ్ఐ ఎన్ని నిర్బంధాలు ఎదుర్కొని బాలమైన విద్యార్థి సంఘంగా అన్ని విశ్వవిద్యాలయాలలో విజయ బహుట ఎగురవేసిందని తెలిపారు.విద్యార్థి సంఘంలో పనిచేస్తున్న సమయంలో అనేక



ఉద్యమాలు, పోరాటాల గురించి అధ్యయనం చేస్తూనే ప్రపంచ దేశాలలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాలకు అండగా నిలిచారు. దేశంలో అణగారిన వర్గాలకు రాజ్యాంగ ఇచ్చిన హక్కులు, సామాజిక తరగతుల హక్కులకై అలుపెరగని ఉద్యమాలు చేశారని, పార్లమెంటులో హక్కుల కోసం , రాజ్యాంగ రక్షణ కోసం పోరాడారని కొనియాడారు. ప్రపంచంలోనే అత్యుత్తమ యూనివర్సిటీలలో అనేక అంశాలపై సీతారాం ఏచూరితో ఉపన్యాసాలు ఆయన ఆహ్వానించి మరీ ఇప్పించేవారని, అందుకే దేశం ఒక గొప్ప మేధావిని కోల్పోయిందని అన్నారు. వారి మరణానికి తీవ్ర సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఈసీఐఎల్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సీతారాం ఏచూరి గారికి చిత్రపటానికి పూల మాలలు వేసి జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సుమన్ , బాబు, శ్రీకాంత్, రమేష, పిఎన్ఎం మాజీ జిల్లా కార్యదర్శి భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## మధర్ డైరీ ఎన్నికలలో 6 గురు డైరెక్టర్ల ఘన విజయం...




**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** రంగారెడ్డి.నల్లగొండ. పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం మధర్ డైరీ.నర్మల్ ఎన్నికల్లో భాగంగా ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్,బీర్ల ఐలయ్య నాయత్వములో జరిగిన 6 గురు డైరెక్టర్ల ఎన్నికల్లో 6కి.6 రు గెలిచిన కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు ఈ ఎన్నిక కృషి చేసిన పాల ఉత్పత్తిదారుల ఛైర్మెన్ లకు మరియు కాంగ్రెస్ కార్యకర్తలకు అందరికీ ధన్యవాదాలు తెలిపిన ఆలేరు ఎమ్మెల్యే. ప్రభుత్వ విప్. బీర్ల ఐలయ్య అదేవిధంగా మధుసూదన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీరామ్ నగర్‌లో ఘనంగా గణపతి ఉత్సవాలు...




**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:**యాదగిరిగుట్ట పరిధి శ్రీరామ్ నగర్ మహిళలు ఘనంగా గణపతి ఉత్స వాలు జరిగాయి. శ్రీరామ్ నగర్ స్థానిక విఘ్నేశ్వరునికి మహిళలు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు స్వామికి సమర్పించి హారతి నివేదన చేశారు. స్వామివారిని స్మరిస్తూ భక్తి శ్రద్ధ లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## లక్కీ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు..



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** లక్కీ స్టార్ యూత్ అసోసియేషన్ పాత గుండ్లపల్లి లో అన్న దాతలు భువనేశ్వరి నరసింహారావు ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విఘ్నేశ్వరుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు ప్రసాదాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాదాద్రి కొండపై శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ



**తెలంగాణ వీణ/యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో శుక్రవారం సందర్భంగా శ్రీ ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ అర్చకులు నిర్వహించారు.స్వామివారిని మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సేవను తిలకించేందుకు భక్తులు తరలి వచ్చారు.అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు..



## మొక్కలు నాటిన కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ "ఏక్ పేడ్ మా కే నామ్"పిలుపుమేరకు హార్టికల్చర్ డిపార్ట్మెంట్ వినాయక్ నగర్ డివిజన్ ఆనంద్ బాగ్ పార్క్ లో అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు .డిపార్ట్మెంట్ వారితో కలిసి మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్క నాటి దాని సంరక్షించాలని బాధ్యతను చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ మేనేజర్ మహేశ్వరి , సూపర్వైజర్ వెంకటేష్ , కాలనీ వాసులు జాయింట్ సెక్రటరీ రవి కుమార్ ,సెక్రటరీ జయ కుమార్ , ఉపాధ్యక్షులు నర్సింగ్ రావు , కోశాధికారి తులసి ,సయీద్ ఫిరోజ్ ఉద్దీన్‌గారు, హనీఫ్ చేరంగాయి డివిజన్ అధ్యక్షులు ఓం ప్రకాష్,గోపాల్ పాల్గొన్నారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిన: మల్కాజిగిరి డీసీ జి. రాజు



**తెలంగాణ వీణ/మల్కాజ్గిరి:** చెత్తా చెదారం, వ్యర్థాలు తొలగించేందుకు అదనంగా వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని జీహెచ్ఎంసీ డీసీ జి రాజు తెలిపారు. నిమజ్జన ఏర్పాట్లు , సందీప్ కుమార్ పోలీస్ సిబ్బందితో కలిసి పరిశీలించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిచేత తరలింపునకు వాహనాలు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. నిరంతరం శానిటేషన్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు.ప్రతిరోజూ నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి తగిన ఆదేశాలు జారీ చేశారు.రోజూ నిమజ్జనాలు జరుగుతున్న నేప థ్యంలో తడిచెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని, రోడ్లన్నీ పరిశుభ్రంగా ఉండాలని అధికారులకు సూచించారు. తెల్లవారుజాము 4 గంటలకే ఈ ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేపట్టారు.

## దమ్మాయిగూడ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తా: ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్



**తెలంగాణవీణ, కీసర :** దమ్మాయిగూడ మున్సిపల్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మున్సిపల్ ఛైర్పర్సన్ ప్రణీత శ్రీకాంత్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టే అభివృద్ధికి పనులకు శంకుస్థాపన చేశారు. 8వ వార్డు ఇందిరమ్మ కాలనిలో రూ. 8 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్డు పనులున, 9వ వార్డు భవాని నగర్ కాలనీలో రూ. 30 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను, 15వ వార్డు సాయి శ్రీనివాస్ నగర్ ఎక్ష్ టెన్షన్ కాలనీ లో రూ. 17 లక్షల తో చేపట్టే సీసీ రోడ్డు పనులకు వైస్ ఛైర్మన్ నరేందర్ రెడ్డీతో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలకు కావల్సిన మౌళిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ నాగమణి, డిఈఈ చిరంజీవులు, వార్డు కౌన్సిలర్లు మాదిరెడ్డి నరసింహా రెడ్డి, సంపరబోలు బోల్ హరి స్వప్న , గోగుల సరిత, మున్సిపల్ సిబ్బంది , స్థానిక కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శికి ఘన సన్మానం....

**తెలంగాణవీణ/మల్కాజిగిరి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్ బాల మల్లేష్ ను అల్వాల్ మండల సహాయ కార్యదర్శి నేతృత్వంలో ఘనంగా సన్మానించారు . ఇటీవల హనుమకొండలో సిపిఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్లో సమావేశంలో అల్వాల్ మండలంలో యాప్రాల్ కు చెందిన ఎన్ బాల మల్లేష్ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర నిర్వహించారు .ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో రాష్ట్ర అఖిలభారత విద్యార్థి సమైక్య ఎస్ఎఫ్ అఖిలభారత యువజన సమైక రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సిపిఐ పార్టీ కార్యదర్శిగా 16 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. భూ పోరాటాలు విద్యార్థి యువజన పోరాటాల్లో కీలకపాత్ర నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు .సిపిఐ పార్టీ అల్వాల్ మండల కార్యదర్శి కే సహదేవ్ మాట్లాడుతూ బాల మల్లేష్ ఎన్ని సంవత్సరాల నుండి పోరాటం సిపిఐ పార్టీలో కీలకపాత్ర నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. సన్మాన కార్యక్రమంలో సిపిఐ అల్వాల్ మండల సహాయ కార్యదర్శి సల్మాన్ బీయింగ్ నాయకులు నిమ్మల నరసింహులు బి నరేంద్ర చారి బి మౌనిక పూల చిరంజీవి అనూష ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




6 9tv తెలుగు

తెలంగాణ వీణ

For Advertisements
8328209811

Flat No 204,
Mythri Appartments,
Opp BSNL Office, ECIL

# డబ్ల్యూటీసీ ఫైనల్ నుంచి ఆస్ట్రేలియా ఔట్



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ కోసం కసరత్తులు ఇప్పటికే మొదలయ్యాయి. పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకునే పనిలో అన్ని జట్లూ బిజీగా ఉన్నాయి.ప్రస్తుతం భారత్, ఆస్ట్రేలియాలు పాయింట్ల పట్టికలో టాప్-2 స్థానాలను ఆక్రమించాయి. డబ్ల్యూటీసీ ఫైనల్ ఈరెండు జట్ల మధ్య మరోసారి టైటిల్ పోరు కనిపించవచ్చని అభిమానులు ఆశిస్తున్నారు. అయితే, పాయింట్ల పట్టికలో వేరే నంబర్ల గేమ్ జరుగుతోంది. ఆస్ట్రేలియా ముందు ఓ జట్టు అడ్డుగా నిలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కూడా డబ్ల్యూటీసీ ఫైనల్ సమీకరణాన్ని పంచుకుంది. పాయింట్ల పట్టికలో టీమ్ ఇండియా అగ్రస్థానంలో ఉంది. సెప్టెంబరు 19 నుంచి బంగ్లాదేశ్‌తో భారత జట్టు స్వదేశంలో 2 టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. దీంతో పాయింట్ల పట్టికలో స్థానం మరింత పటిష్టం చేసుకోవచ్చు. %ఔజ% ఫైనల్ చేరే రేసులో భారత్‌కే అత్యధిక అవకాశాలు ఉన్నాయి. బంగ్లాదేశ్ తర్వాత భారత్ కూడా న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌లు ఆడాల్సి ఉంది. ఆస్ట్రేలియా టూర్‌లో 5 టెస్టుల్లో కనీసం 3 టెస్టుల్లో భారత్ గెలిస్తే ఫైనల్స్‌లో చోటు ఖాయం చేసుకోవచ్చు. టీమ్ ఇండియా మొత్తం 10 టెస్టుల్లో గెలిస్తే ఆ జట్టు పాయింట్ల శాతం 85.09 అవుతుంది. ఆస్ట్రేలియా టూర్‌తో పాటు సొంతగడ్డపై జరిగే 5 టెస్టుల్లోనూ భారత్ గెలిస్తే పాయింట్ల శాతం 79.76కి చేరుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం టీమ్ ఇండియాకు ఫైనల్ చేరే మార్గం సులభమైంది. గత 10 ఏళ్లుగా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని ఆస్ట్రేలియా చేజిక్కించుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈసారి కూడా ఈ జట్టుకు పెద్ద సవాల్‌గా మారనుంది. ఆస్ట్రేలియా జట్టు భారత్‌పై 5 టెస్టులు, శ్రీలంకతో స్వదేశంలో 2 టెస్టులు గెలిస్తే, అది గరిష్టంగా 76.32 శాతం పాయింట్లను స్కోర్ చేస్తుంది. ఇది ఫైనల్‌కు మంచిది. అయితే, ఆస్ట్రేలియా ముందు న్యూజిలాండ్ జట్టు అడ్డంకిగా మారుతున్నట్లు కనిపిస్తోంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని భారత్ నుంచి న్యూజిలాండ్ జట్టు కైవసం చేసుకుంది. ఈసారి కూడా ఆస్ట్రేలియా కంటే ఈ జట్టుకే ఫైనల్స్‌కు చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కివీస్ జట్టు భారత్‌తో 3, శ్రీలంకతో 2 టెస్టులు ఆడాల్సి ఉంది. ఆ తర్వాత స్వదేశంలో ఇంగ్లండ్‌తో 3 టెస్టుల సిరీస్ కూడా జరగనుంది. ఈ జట్టుకు ఇంకా 8 మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం న్యూజిలాండ్ 50 శాతం పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. అయితే, అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే ఈ జట్టు 78.57 పాయింట్లు పొందే అవకాశం ఉంది.

### తొలి మ్యాచ్‌లోనే 8 వికెట్లతో

# మానవ్ సుతార్ ఉగ్రరూపం



దులీప్ ట్రోఫీ 2024లో నాలుగో మ్యాచ్ ఇండియా బి వర్సెస్ ఇండియా డి మధ్య జరుగుతోంది. ఈ సమయంలో, ఇండియా సి మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేసి 450 కంటే ఎక్కువ పరుగులు చేసింది. ఇందులో ఇషాన్ కిషన్, బాబా ఇందర్‌జిత్ వంటి బ్యాట్స్‌మెన్‌లతో పాటు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ అద్భుతమైన ఇన్నింగ్స్‌లు కూడా తోడయ్యాయి. ఈ సమయంలో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ అద్భుతమైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన ఓ ఆటగాడిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. తొలి మ్యాచ్‌లో బంతితో అద్భుతాలు చేసిన ఈ ఆటగాడు.. రెండో మ్యాచ్‌లో బ్యాట్‌తో అద్భుతాలు చేశాడు. అయితే, ఈ ఆటగాడు ఇప్పుడు రవీంద్ర జడేజాకు కూడా ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నాడు అంటూ మాజీలు మాట్లాడుతున్నారు. దులీప్ ట్రోఫీ 2024లో తన మొదటి మ్యాచ్‌లో ఇండియా సి తరపున ఆడుతున్న మానవ్ సుతార్ మొత్తం 8 వికెట్లు (రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు) పడగొట్టాడు. ఇప్పుడు బౌలింగ్ తర్వాత, మానవ్ సుతార్ రెండో మ్యాచ్‌లో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని అద్భుతంగా ప్రదర్శించాడు. ఇండియా సి తరపున ఏడో నంబర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ హాఫ్ సెంచరీ చేశాడు. మానవ్ సుతార్ ఈ ప్రదర్శన అతనికి భారత జట్టులో తదుపరి ఆల్ రౌండర్ ఆటగాడిగా చోటు సంపాదించవచ్చు. భవిష్యత్తులో జట్టులో చోటు దక్కించుకోగల రవీంద్ర జడేజాకు ఎడమచేతి వాటం స్పిన్ బౌలర్ వారసుడిగా అభివర్ణిస్తున్నారు. ప్రస్తుతం, దులీప్ ట్రోఫీ టోర్నమెంట్ అతని కెరీర్‌లో ఒక పెద్ద మైలురాయిగా నిరూపిస్తోంది. ఇది అతని తదుపరి టెస్ట్ కెరీర్‌కు పెద్ద ఊపునిస్తుంది. ఇండియా సి, ఇండియా డి జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో మానవ్ సుతార్ దేవదత్ పడిక్కల్, అక్షర్ పటేల్ వంటి బ్యాట్స్‌మెన్‌లను పెవిలియన్ దారి చూపి తన స్పిన్ బౌలింగ్‌కు బలిపశువులను చేశాడు. ఈ సమయంలో మానవ్ రెండో ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు పడగొట్టాడు. దులీప్ ట్రోఫీతో పాటు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇప్పటివరకు మానవ్ సుతార్ ప్రదర్శన కూడా ప్రశంసనీయం. అతను మొత్తం 15 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో 22.90 బౌలింగ్ సగటుతో 73 వికెట్లు తీశాడు. ఈ కాలంలో అతను బ్యాటింగ్‌లో అత్యధిక స్కోరు 96తో మొత్తం 508 పరుగులు చేశాడు.



# బంతి పడకుండానే ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్ రద్దు

గ్రేటర్ నోయిడా వేదికగా ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగాల్సిన ఏకైక టెస్టు వర్షం కారణంగా రద్దయ్యింది. పిచ్ చిత్తడిగా ఉండటంతో ఆట సాధ్యపడకపోగా.. చివరి మూడు రోజులు వర్షం వల్ల మ్యాచ్ జరగలేదు. దాంతో, ఇరు జట్ల కెప్టెన్లు ఫోటో షూట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. శుక్రవారం(సెప్టెంబర్ 13) ఉదయం నోయిడాలో భారీ వర్షం కురవడంతో ఐదో రోజు ఆట సాధ్యపడలేదు. దాంతో, అంపైర్లు మ్యాచ్ రద్దు అయినట్లు ప్రకటించారు. కనీసం ఈ మ్యాచ్ టాస్ కూడా వేయకపోవడం గమనార్హం. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇలా ఒక్క బంతి పడకుండా మ్యాచ్ రద్దు చేయడం ఇది ఎనిమిదోసారి కాగా.. భారత గడ్డపై తొలిసారి. 1933 నుంచి భారత్ టెస్టులకు ఆతిథ్యం ఇస్తోంది. రద్దయిన ఆఫ్ఘనిస్తాన్- న్యూజిలాండ్ రికార్డుల్లోకెక్కింది. భారత గడ్డపై ఒక టెస్టు మ్యాచ్ బంతి కూడా వేయకుండా రద్దు చేయడం 91 ఏళ్ల భారత టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి. ఆసియాలో ఇంతకు ముందు 1998లో ఫైసలాబాద్ వేదికగా పాకిస్థాన్- జింబాబ్వే మధ్య జరిగిన టెస్ట్ ఒక్క బంతి వేయకుండానే రద్దయ్యింది. బంతి వేయకుండానే రద్దయిన టెస్ట్ మ్యాచ్‌లు1890: ఇంగ్లాండ్ - ఆస్ట్రేలియా (మాంచెస్టర్)1938: ఇంగ్లాండ్ - ఆస్ట్రేలియా (మాంచెస్టర్)1970: ఆస్ట్రేలియా - ఇంగ్లాండ్ (మెల్‌బోర్న్)1989: న్యూజిలాండ్ - పాకిస్థాన్ (డునెడిన్)1990: వెస్టిండీస్ - ఇంగ్లాండ్, (జార్జిటౌన్)1998: పాకిస్తాన్ - జింబాబ్వే (ఫైసలాబాద్)1998: న్యూజిలాండ్ - ఇండియా (డునెడిన్)2024: ఆఫ్ఘనిస్తాన్ - న్యూజిలాండ్, గ్రేటర్ నోయిడా(ఇండియా)

# ఈసారి దంచేది ఆ ఇద్దరే.. మ్యాక్స్‌వెల్ కామెంట్స్ వైరల్

భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరగనున్న బోర్డర్ - గవాస్కర్ ట్రోఫీకి ఇంకా రెండు నెలలు ఉంది. కానీ, ఇప్పటికే ఈ ట్రోఫీపై రోజుకో చర్చ తెరపైకి వస్తోంది. ఇప్పటి వరకూ సిరీస్ విజేతగా నిలిచేది ఎవరు అనేదానిపై ఇరు దేశాల మాజీలు కొందరు తలోమాట చెప్పారు. ఇప్పుడు ఈ సిరీస్‌లో పరుగుల వరద పారించేది ఎవరు? అనే ప్రశ్న మొదలైంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.ఆస్ట్రేలియా ఆతిథ్యమిస్తున్న బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పరుగుల వీరుడుగా నిలిచేది ఎవరో మ్యాక్సీ చెప్పేశాడు. ఫ్యాబ్ 4లో ఒకరైన విరాట్ కోహ్లీ, స్టీవ్ స్మిత్‌లలో ఎవరో ఒకరు దంచి కొడుతారని ఈ ఆల్‌రౌండర్ అన్నాడు. సూపర్ స్టార్ అటగాళ్లు అయిన కోహ్లీ, స్మిత్‌లు తమ స్టయిల్లో చెలరేగిపోతారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో వాళ్లు కచ్చితంగా తమ ముద్ర వేస్తారు. వీళ్లలో ఇద్దరు కాకపోయినా ఎవరో ఒకరు అత్యధిక రన్స్ కొడుతారు.



# దులీప్ ట్రోఫీలో సంజూ శాంసన్ విఫలం

దులీప్ ట్రోఫీ 2024లో రెండో రౌండ్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అనంతపురంలో ఇండియా సితో ఇండియా డి టీమ్ తలపడుతోంది. ఇండియా డి కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నిరాశపరిచాడు. 7 బంతులు ఎదుర్కొన్న శ్రేయాస్.. ఒక్క పరుగు కూడా చేయలేకపోయాడు. ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో ఆకిబ్ ఖాన్‌కు క్యాచ్ ఇచ్చి డకౌట్‌గా పెవిలియన్‌కు చేరాడు. కెప్టెన్‌గా కీలక ఇన్నింగ్స్ ఆడాల్సిన అతడు విఫలమవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ఇలాగే ఆడితే భారత జట్టులోకి రావడం కష్టమే అని కామెంట్స్ చేస్తున్నారు. అనంతపురంలో ఎండ వేడిని తట్టుకోలేక బ్యాటింగ్‌కు వచ్చే సమయంలో శ్రేయస్ సన్‌గ్లాసెస్‌ను పెట్టుకోవడం గమనార్హం. దులీప్ ట్రోఫీలో ఆడుతున్న సంజూ శాంసన్ కూడా విఫలమయ్యాడు. ఇండియా డి తరపున బరిలోకి దిగిన సంజూ.. ఆరు బంతులు ఎదుర్కొని ఐదు పరుగులే చేశాడు. కీలక సమయంలో క్రీజ్‌లో ఉండాల్సిన అతడు అవుట్ అవ్వడం సంజూ అభిమానులను నిరాశకు గురిచేసింది. మరోవైపు ఇషాన్ కిషన్ సెంచరీ చేయడంతో సంజూకు భారత జట్టులోకి రావడం మరింత ఇబ్బందిగా మారింది. తదుపరి ఇన్నింగ్స్‌లోనైనా సంజూ రాణించాల్సిన ఆవశ్యకత ఉంది. ఈ మ్యాచులో ఇండియా ఎ తొలి ఇన్నింగ్స్‌లో 290 పరుగులకు ఆలౌటైంది. షామ్స్ ములానీ (89), తనుష్ కోటియన్ (53) పరుగులు చేశారు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (7) మరోసారి తక్కువ స్కోరుకే అవుట్ అయ్యాడు. ప్రస్తుతం ఇండియా డి 164/8 స్కోరుతో కొనసాగుతోంది. దేవదత్ పడిక్కల్ (92) జట్టును ఆదుకున్నాడు. హర్షిత్ రానా, అర్షదీప్ సింగ్ క్రీజులో ఉన్నారు. ఇండియా డి ఇంకా 120 పరుగులు వెనకబడి ఉంది.



# చెన్నైకి ధోనీ మొదటి ఛాయిస్

భారత జట్టు మాజీ సారథుల్లో మహేంద్ర సింగ్ ధోనీ ఆల్‌టైమ్ గ్రేట్. టీమిండియాకు మూడు ఐసీసీ ట్రోఫీలు తెచ్చిన ధోనీ ఇండియన్ ప్రీమియర్‌లోనూ కెప్టెన్‌గా రాణించాడు. రికార్డు స్థాయిలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంఛైజీకి ఏకంగా ఐదు ట్రోఫీలు కట్టబెట్టిన ఘనత మహీ భాయ్‌దే. 18వ సీజన్‌లో ఈ దిగ్గజ ఆటగాడు బరిలోకి దిగడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే మాజీ క్రికెటర్ బద్రీనాథ్ సంచలన విషయం చెప్పాడు. ఐపీఎల్ ఆరంభ సీజన్‌లో ధోనీ సీస్కేకు ఫస్ట్ చాయిస్ కాదని అన్నాడు.





GS9TV తెలుగు
తెలంగాణ వీణ
నిజం నిగ్గు తేలుద్దాం..
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
అతి కొద్ది కాలంలోనే ప్రజలకు ప్రజాప్రతినిధులకూ వారధి గా ప్రదర్శింపబడుతున్న
GS9TV కేబుల్ ఛానల్, తెలంగాణ వీణ తెలుగు దినపత్రికకు
అన్నీ జిల్లాల నుండి విలేకరులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
8328209811
9703024024


# మర్డర్ కేసు ఛేదన..మత్తువదలరా-2



కొనసాగింపు సినిమాలకు, ఫ్రాంఛైజీలకు తెలుగు చిత్రసీమ బాగా అలవాటుపడిపోయింది. ఆ కోవలో రూపొందిన చిత్రమే మత్తు వదలరా2. ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీ సింహా కథానాయకుడిగా మత్తు వదలరాతో పరిచయమై మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆ చిత్రానికి కొనసాగింపుగా అదే బృందం చేసిన ప్రయత్నమే మత్తువదలరా2. డెలివరీ ఏజెంట్స్ ఉద్యోగాలు ఊడటంతో బాబూ మోహన్ (శ్రీసింహా), యేసు (సత్య) ఎన్నో పాట్లు పడి హై ఎమర్జెన్సీ టీమ్‌లో స్పెషల్ ఏజెంట్స్‌గా చేరతారు. కిడ్నాప్ కేసుల్ని ఛేదించి, నిందితుల్ని పట్టుకోవడంలో ఆరితేరిపోతారు. ఆ క్రమంలోనే చేతివాటం ప్రదర్శిస్తూ కొద్ది మొత్తంలో డబ్బు తస్కరిస్తూ ఎవ్వరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడుతుంటారు. ఇలా కొంచెం కొంచెం సంపాదన ఎంత కాలమని, కొడితే కుంభ స్థలాన్ని కొట్టాలని ఓ నిర్ణయానికొస్తారు. ఆ సందర్భంలోనే ఓ కిడ్నాప్ కేసు వస్తుంది. రూ.2 కోట్లు లావాదేవీలతో ముడిపడిన కేస్ అది. ఆ కేసును ఛేదించి, దాంతో సంబంధం ఉన్న రూ.2 కోట్లు సొంతం చేసుకుకోవాలనే వ్యూహంతో రంగంలోకి దిగుతారు. కానీ, అనూహ్యంగా కిడ్నాప్‌నకు గురైన యువతి వీళ్ల కారులోనే శవమై తేలుతుంది. వీళ్లే కిడ్నాప్ చేశారనే రుజువుతో కూడిన ఓ వీడియో కూడా బయటికొస్తుంది. మరింతకీ ఆ హత్య చేసిందెవరు? ఈ కేస్ నుంచి బాబు మోహన్, యేసు బయట పడ్డారా? లేదా? డబ్బు సంపాదించాలనే వీళ్ల కోరిక నెరవేరిందా అన్నదే చిత్ర కథ. కొనసాగింపు చిత్రం అనగానే అంతకుముందు వచ్చిన సినిమాతో పోల్చి చూడటం మొదలవుతుంది. అయితే కథ, కథనాల పరంగా మెరుపులు లేకపోవడం ఈ సినిమాకి ప్రధాన లోపం. తొలి సినిమా తరహాలోనే బాబూ మోహన్, యేసుదాసుకి డబ్బుపై ఆశ పుట్టడం, తస్కరణ కోసం ప్లాన్ చేయడం, తీరా కథ అడ్డం తిరిగి సమస్యల్లో చిక్కుకోవడం, వాటినుంచి బయట పడేందుకు పడే పాట్లు, ఆ పాట్లు పుట్టించే హాస్యం. ఇదే మత్తువదలరా2 కూడా. తొలి సినిమాలోని 'ఓరి నా...' సీరియల్ ఇందులోనూ కొనసాగుతుంది. కాకపోతే, ఈసారి రచనలో బలం లేకపోవడంతో తొలి సినిమా స్థాయిలో సహజంగా, ఆ మోతాదులో హాస్యం పండదు. డెలివరీ ఏజెంట్స్ కాస్త స్పెషల్ ఏజెంట్స్ ఎలా అయ్యారో, వాళ్ల తస్కరణ ఈసారి ఎలా సాగుతుందో చూపిస్తూ సినిమాని మొదలుపెట్టాడు దర్శకుడు. ఆ సన్నివేశాలన్నీ నవ్వుల్ని పంచుతాయి. రూ.2 కోట్లతో ముడిపడిన కిడ్నాప్ వ్యవహారం నుంచే కథలో డ్రామా మొదలవుతుంది. ఊహించని విధంగా ఆ కిడ్నాప్ కేసు ప్రధాన పాత్రధారుల మెడకు చుట్టుకోవడం, దాన్నుంచి వాళ్లు బయట పడేందుకు చేసే ప్రయత్నాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు కథకి మంచి మలుపునిస్తూ ద్వితీయార్థంపై ఆసక్తిని పెంచుతాయి. హత్య కేసు నుంచి ఆ ఇద్దరూ ఎలా బయట పడతారన్నది ద్వితీయార్థంలో కీలకంగా మారుతుంది. తాము ఆ కేసులో ఎలా ఫ్రేమ్ అయ్యామో ప్రధాన పాత్రధారులు కనుక్కుంటూ, అసలు సూత్రధారులెవ్వరో కనిపెట్టే క్రమం సినిమాని ఓ ఇన్వెస్టిగేషన్ డ్రామాగా మార్చేసింది. ఆ క్రమంలో కామెడీ మోతాదు తగ్గిపోయినట్టు అనిపిస్తుంది. మొత్తంగా వన్ లైనర్స్‌తో కూడిన పంచ్‌లు, సత్య చేసే అల్లరి, ట్రెండీ డైలాగ్స్, అగ్ర తారల సినిమాలకి సంబంధించిన రెఫరెన్సులు సినిమాని సందడిగా మార్చేశాయి. ఈ తరహా చిత్రాల్లో చమత్కారాన్ని ఆస్వాదించాలి కానీ, తర్కం గురించి ఆలోచించకూడదు.కాల భైరవ సంగీతం చిత్రానికి ప్రధాన బలం. కెమెరా, ఎడిటింగ్ విభాగాలూ చక్కటి పనితీరుని కనబరిచాయి. దర్శకుడు రితేష్ రాణా మార్క్ సంభాషణలు నవ్విస్తాయి. కథనం పరంగానే పెద్దగా ప్రభావం చూపించలేకపోయారు. నిర్మాణం ఉన్నతంగా ఉంది.

# డబ్బింగ్‌లో చెప్పి..డైలాగ్ నడిపించా...


**- ఛత్రపతి చిత్రీకరణపై ప్రభాస్**



పాన్ ఇండియా స్టార్‌గా వరుస సినిమాలతో అలరిస్తున్నారు ప్రభాస్. ఇటీవల ఆయన నటించిన 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ప్రభాస్ కటౌట్‌ను సరిగ్గా వాడుకున్న దర్శకుల్లో ఎస్.ఎస్.రాజమౌళి ఒకరు. వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఛత్రపతి' మంచి విజయాన్ని అందుకుంది. ఇక 'బాహుబలి' సినిమాల గురించి, ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రభాస్, రాజమౌళి కాంబినేషన్‌లో వచ్చిన 'ఛత్రపతి' చిత్రీకరణలోనూ ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. బాజీరావును చంపేసిన తర్వాత ప్రభాస్ అతడి శవాన్ని ఈడ్చుకెళ్లి రాజకీయ నాయకుడైన అప్పలనాయుడు (కోట శ్రీనివాసరావు)కు వార్నింగ్ ఇస్తాడు. ఆ తర్వాత అక్కడి నుంచి బయటకు వచ్చి ప్రజల కోసం పోరాటం చేస్తానని చెబుతాడు. అయితే, అప్పుడు సెట్‌లో ప్రభాస్ డైలాగ్‌లే చెప్పలేదట. కేవలం పెదవులు మాత్రమే కదిపారట. ఇంటర్వెల్ షాట్‌లో జనాన్ని ఉద్దేశించి మాట్లాడాలి. ఒకపక్క వర్షం. పైగా చలి. రాజమౌళి దగ్గరకు వెళ్లి 'డార్లింగ్ డైలాగ్ గట్టిగా చెప్పలేను. సైలెంట్‌గా చెబుతాను' అని అనడంతో జక్కన్న కూడా ఓకే అన్నారు. ఆ షాట్‌లో కేవలం పెదాలు కదిపానంతే. అక్కడున్న వాళ్లకు నేను ఏ చేస్తున్నానో అర్థం కాలేదు. షాట్ ఓకే అయిపోయింది. జనం ఉంటే ఎందుకో సైలెంట్ అయిపోతా. 'మిస్టర్ పర్‌ఫెక్ట్' చేస్తున్నప్పుడు కూడా విశ్వనాథ్‌గారు సెట్‌లో ఉండగా ఇలాగే సైలెంట్‌గా డైలాగ్‌లు చెప్పేవాడిని. ఆయన పిలిచి 'ఇలా అయితే ఎలా? ఓపెన్‌గా డైలాగ్ చెప్పాలి. మరీ అంత సిగ్గుపడితే ఎలా?' అన్నారు. నాతో పనిచేసిన దర్శకులు అందరూ రాజమౌళిని తిట్టుకుంటారు. 'ఆయన వల్లే నువ్వు ఇలా చెబుతున్నావు'(నవ్వులు) అని అనేవారు' అంటూ ప్రభాస్ ఓ సందర్భంలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ప్రభాస్ వరుస సినిమాలతో అలరిస్తున్నారు. మారుతీ దర్శకత్వంలో 'ది రాజా సాబ్' శరవేగంగా చిత్రీకరణ జరుపుకొంటోంది. హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి దీన్ని తీర్చిదిద్దుతున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ పీరియాడిక్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపించనున్నారు. 1940 దశకంలో జరిగే కథ అని కాన్సెప్ట్ పోస్టర్ చూస్తే అర్థమవుతోంది. ఇమాన్వీ ఎస్మాయిల్ కథానాయిక. ఇటీవల చిత్రీకరణ మొదలైంది. దీంతో పాటు 'కల్కి2', 'సలార్2' చేయాల్సి ఉంది. మంచు విష్ణు 'కన్నప్ప'లోనూ అతిథి పాత్రలో ప్రభాస్ మెరవనున్నారు.

# కరణ్ సలహాతో ..
# తెలుగులోకి జాన్వీ ఎంట్రీ

శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీకి వచ్చిన జాన్వీకపూర్ వైవిధ్యమైన కథలు ఎంచుకుంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. బాలీవుడ్‌లో వరుస సినిమాలు చేస్తూనే టాలీవుడ్‌లో స్టార్ హీరోల సరసన అవకాశాలు అందుకున్నారు. అయితే ఈ అమ్మడు టాలీవుడ్‌కు ఎంట్రీ ఇవ్వడం వెనక ఓ స్టార్ దర్శకనిర్మాత ఉన్నట్లు తెలుస్తోంది. బాలీవుడ్‌లో ఎంతో మంది నటీనటులు వారి కెరీర్ గురించి కరణ్ జోహర్ సలహాలు తీసుకుంటూ ఉంటారని టాక్. అలానే జాన్వీకి కూడా కరణ్ ఓ సూచన చేశారట. బీటౌన్‌లో తొలి అవకాశం అందుకున్న తర్వాత జాన్వీ తమిళ, తెలుగులో ఛాన్స్‌లు వచ్చాయని దీంతో ఆమె కోలీవుడ్.. టాలీవుడ్‌లలో దేన్ని ఎంచుకోవాలో కరణ్‌ను సలహా కోరినట్లు సమాచారం. ఎన్టీఆర్ సినిమాతో టాలీవుడ్‌కు ఎంట్రీ ఇస్తే తెలుగులో మంచి ఛాన్స్‌లు వస్తాయని కరణ్ ఆమెతో చెప్పారట. దీంతో జాన్వీ వెంటనే 'దేవర'ను ఓకే చేసేశారు. కరణ్ సలహా ఈ భామకు కలిసొచ్చినట్లే ఇక్కడ స్టార్ హీరో సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు. ఎన్టీఆర్‌తో సినిమా చేస్తుండగానే మెగా హీరో రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేశారు. నానితో కూడా ఓ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వార్తల వస్తున్నాయి. బీటౌన్‌లో జాన్వీ ఇప్పటి వరకు చిన్న హీరోల సినిమాల్లోనే నటించారు. కానీ, తెలుగులో మాత్రం తొలి సినిమానే ఎన్టీఆర్‌తో ఆడిపాడ నున్నారు. బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్స్‌కు పోటీ ఇవ్వలేని జాన్వీ.. ఇక్కడ మాత్రం టాప్ లిస్ట్ హీరోయిన్స్‌కు గట్టిపోటీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'దేవర'లో ఇప్పటి వరకు రిలీజైన పాటల్లో జాన్వీ అందానికి, డ్యాన్స్‌కు ఆడియన్స్ ఫిదా అవుతున్నారు. తాజాగా రిలీజైన 'దావుదీ..' సాంగ్‌లో ఎన్టీఆర్‌తో సమానం గా డ్యాన్స్ వేసిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. దీంతో ఈ సినిమా విడుదలయ్యాక జాన్వీ మరిన్ని అవకాశాలు అందుకోవడం ఖాయమని వారు భావిస్తున్నారు.












Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Flat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Ecil,Kapra,Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35668720, RNI Reg N0: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written